# పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 231 | విశాఖపట్నం | 22-5-2026 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 231 | VISAKHAPATNAM | 22-5-2026 FRIDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI
PATHAKAM NEWS
SCAN & PAY
UPI ID: 44576280686@sbi
BHIM | UPI | yono SBI | BHIM SBI Pay | G Pay | Paytm | Pay


# బుచ్చయ్య పేట తహసిల్దార్ కార్యాలయం ముట్టడి..

- తహసీల్దార్ కార్యాలయంలో ఉద్రిక్తత వాతావరణం....
- కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు..
- చిన భీమవరంలో రైతుల భూముల ఆక్రమణపై చోద్యం చూస్తున్న అధికారులు..
- న్యాయం చేయాలంటూ తాసిల్దార్ కారును అడ్డగించిన మహిళా రైతులు..
- మీడియా ప్రతినిధులకు సమాధానం చెప్పకుండా పలాయనం చిత్తగించిన ఎమ్మార్వో..









**బుచ్చయ్యపేట, పతాకం న్యూస్ ప్రతినిధి :** మండల తాసిల్దార్ కార్యాలయానికి వాస్తు దోషం ఉందేమో అనే సందేహం కలుగుతుంది. ఇటీవల చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏసీబీ అధికారుల దాడితో అంటుకున్న అవినీతి మరకలు ఇంకా చెరిగిపోక ముందే గురువారం తహసిల్దార్ కార్యాలయం చిన భీమవరం గ్రామ రైతుల ఆగ్రహానికి గురైన తహసీల్దార్ సమాధానం చెప్పలేక కార్యాలయం నుండి రైతులను తప్పించుకొని పారిపోయే దుస్థితి ఏర్పడింది. వివరాలు ప్రకారం మండలంలోని చిన్న భీమవరం గ్రామానికి చెందిన దళిత రైతులకు 1983 లో ప్రభుత్వం డి పారం పట్టాలు మంజూరు చేసింది. ఆ భూములపై కన్నేసిన గ్రామానికి చెందిన కొంతమంది కూటమి నాయకులుగా చలామణి అవుతున్న వారు దళిత (తరువాయి 2వ పేజీలో)



2లో

## నక్కపల్లిలో సైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం

ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసిన హోంమంత్రి అనిత



7లో

## భారత్‌లో బిలియనీర్ల జాబితాలో మొదటి రెండు స్థానాల్లో అంబానీ, అదానీ




6లో

## ప్రీడయాబెటిస్ ఉన్నవారికి విటమిన్ డి ఇస్తే మెరుగైన ఫలితాలు..?

### ఏపీలో భారీ పెట్టుబడుల దిశగా అడుగులు.. ప్రాజెక్టుల పురోగతిపై

# చంద్రబాబు సమీక్షా సమావేశం



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టుల పురోగతిపై కీలక సమీక్షా సమావేశం గురువారం సచివాలయంలో జరిగింది. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఒప్పందాలు, అలాగే ఎస్ఐపీబీ ద్వారా ఆమోదం పొందిన ప్రాజెక్టుల అమలుపై మంత్రుల కమిటీతో సీఎం సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలోని మంత్రుల కమిటీ ప్రాజెక్టుల పురోగతిపై సీఎం చంద్రబాబుకి వివరాలు అందించింది. ఇప్పటివరకు ఎస్ఐపీబీ ద్వారా రూ.11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో మొత్తం 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపినట్లు సీఎం వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధికి ఇవి కీలక మైలురాళ్లుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుల్లో ఇప్పటికే 114 ప్రాజెక్టులు గ్రౌండింగ్ దశకు చేరుకున్నాయని, వాటి ద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు సృష్టించవచ్చని లోకేశ్ వివరించారు. పెట్టుబడిదారులతో కుదిరిన ఒప్పందాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదిరిన ఎంఓయూలకు సంబంధించిన ప్రాజెక్టులకు వేగంగా (తరువాయి 2వ పేజీలో)

## విశాఖలో 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం : ఎంపీ శ్రీభరత్



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖలో మౌలిక సదుపాయాలు, పట్టణాభివృద్ధికి సంబంధించి 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం తెలిపినట్లు విశాఖ ఎంపి శ్రీ భరత్ తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ పథకం కింద జివిఎంసి ప్రతిపాదించిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నేషనల్ అపెక్స్ కమిటీ (చీూజ) ఆమోదం తెలిపినట్టు వివరించారు. (తరువాయి 2వ పేజీలో)



## ఢిల్లీలో స్తంభించనున్న రవాణా!

2లో

# నెదర్లాండ్స్ ప్రధానికి మోడీ అరుదైన కానుక

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ప్రధాని నరేంద్ర మోడీ ఐదు దేశాల పర్యటన ముగించుకుని గురువారం ఉదయం భారత్ చేరుకున్నారు. ఈ విదేశీ పర్యటనలో భాగంగా నెదర్లాండ్స్‌లో ప్రధాని మోదీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆ దేశ ప్రధాని రాబ్ జెట్టెన్‌కి చేపల ఆకృతితో ఉన్న మధుబని పెయింటింగ్‌ను బహుమతిగా ప్రధాని మోదీ అందజేశారు. ఈ మధుబని పెయింటింగ్ అత్యంత ప్రాచీనమైనది. ఈ పెయింటింగ్ భౌగోళిక గుర్తింపు పొందింది. జానపద కళను ప్రతిబింబించే ఈ పెయింటింగ్‌లు.. భారత్, నేపాల్‌లోని మిథిలా ప్రాంతంలో ఉంటాయి. పండగలు, వివాహాలు (తరువాయి 2వ పేజీలో)





## ఏపీలో ఎండల ఎఫెక్ట్.. మూడు రోజుల పాటు వడగాలుల హెచ్చరిక

2లో


పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## పొదుపు..

మోడీ, బాబు అకస్మాత్తుగా ప్రవచనకారులుగా మారిపోయారు. పొదుపు జపం ఆలపిస్తున్నారు. మోడీ ప్రధానిగా వున్నంత కాలం ఎవరు ఎవరితో యుద్ధం చేసినా మన దేశానికి చమురు సమస్యే రాదు, ప్రజలపై భారం పడదు అంటూ అటు పాలకులు, ఇటు ప్రధాన మీడియా సంస్థలు మొన్నటి అసెంబ్లీ ఎన్నికలు ముగిసే వరకు చెప్పిన గంభీర వాక్కులన్నీ ఉత్తర కుమార ప్రేలాపనలైపోతున్నాయి. బంగారం కొనుగోలు వద్దని, 'పెట్రోల్, డీజల్ వాడకం తగ్గించాలని, ఒక కారులో ఎక్కువ మంది వెళ్లాలని (కార్ పుల్లింగ్), ఆర్టీసి, రైల్వే లాంటి ప్రజా రవాణాను ఉపయోగించాలని, ఉద్యోగులు ఆఫీసుల నుండి కాకుండా ఇంటి నుంచి పని (వర్క్ ఫ్రమ్ హోమ్) చేయాలని, వంట నూనెను తక్కువగా వాడి దేశాన్ని, దేహాన్ని కాపాడాలని, అత్యవసరం లేని విదేశీ పర్యటనలను సంవత్సరం పాటు రద్దు చేసుకోవాలని మోడీ హైదరాబాద్ నుండి దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే రంగంలోకి దిగారు. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు సైకిళ్లు, స్కూటర్లు ఎక్కారు. మరికొందరు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం చేస్తూ గత 'స్వచ్ఛ భారత్' నాటి జ్ఞాపకాలను గుర్తు చేస్తున్నారు. వీరే కాదు, కార్పొరేట్ కంపెనీల యజమానుల నుండి రిజర్వు బ్యాంకు గవర్నర్ వంటి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఇంధన పొదుపు, ఆర్థిక సమస్యల బృందగానం ఆలపిస్తున్నారు. మన రాష్ట్రంలోని ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక యజమాని ఈ ఆదివారం రాసిన పలుకులో వ్యవసాయ కూలీలకు కూడా రెండు మూడు సెల్‌లు వున్నాయని, వీరికి హామీతో కూడిన ఉపాధి పనులు అవసరమా అంటూ ప్రశ్నించారు. వీరందరి మాటలు, రాతలు చూస్తుంటే నోట్ల రద్దు, లాక్‌డౌన్ లాంటి ఉపద్రవం ఏదో త్వరలో వస్తుందనే భావం ప్రజల్లో పెరుగుతున్నది. గతంలో ఎప్పుడూ లేనంతగా 2025-26 సంవత్సరంలో 800 టన్నుల బంగారం (సగటున రోజుకు రెండు టన్నులకు పైగా) దేశంలోకి దిగుమతి అయ్యింది. ఇందుకోసం రూ.6.88 లక్షల కోట్ల రూపాయలు డాలర్ల రూపంలో దేశీయ డబ్బు విదేశాలకు వెళ్లింది. ఈ కొనుగోలుదారులు ఎవరు? మంగళసూత్రం కూడా కొనలేక ఉచిత వివాహాల కోసం ఎదురు చూస్తున్న కోట్ల మందిలో వున్నారా? వున్న కొద్దిపాటి బంగారాన్ని కూడా బ్యాంకుల్లో తాకట్టు పెట్టి విడిపించుకోలేని లక్షల సంఖ్యలో వున్న చిన్న, సన్నకారు రైతుల్లో వున్నారా? దేశంలో 50.3 శాతం మందికి స్వంత ద్విచక్ర వాహనం లేదని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎస్.ఎస్.ఎ) ప్రకటించింది. 147 కోట్ల జనాభా వున్న దేశంలో కేవలం 26 కోట్ల ద్విచక్ర వాహనాలు మాత్రమే రోడ్లపై తిరుగుతున్నాయని, అంటే ప్రతి వెయ్యి మందికి 185 వాహనాలు మాత్రమే వున్నాయని ప్రభుత్వ నివేదికలు చెబుతున్నాయి. ప్రతి రోజు రైల్లో ప్రయాణం చేస్తున్న వారు సగటున 2.3 కోట్ల మంది వున్నారు. ఇందులో సుమారు 52 శాతం మంది కిక్కిరిసిన జనరల్ బోగీలలో ప్రయాణిస్తుంటే ప్రజా రవాణా ఎవరు చేయాలి? ఎవరు చమురు పొదుపు పాటించాలి? కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖ 2025 గణాంకాల ప్రకారం ప్రతి సంవత్సరం సుమారు 3.27 కోట్ల మంది భారతీయులు విదేశాలకు వెళుతున్నారు. ఇందులో ఎక్కువమంది అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, థారులాండ్ దేశాలకు వెళుతున్నారు. అరబ్ దేశాలకు వెళ్లే వారిలో అత్యధికమంది ఉపాధి కోసం వెళుతున్నవారే. వీరుకాక మిగిలిన ప్రయాణికుల్లో 43.5 శాతం మంది వినోదం కోసం, 34.1 శాతం స్నేహితులు, కుటుంబ సభ్యులను కలవడానికి, 14.6 శాతం వ్యాపార పనుల మీద వెళుతున్నారు. గత సంవత్సరం అత్యధికంగా కేవలం వినోదం కోసమే విదేశీ పర్యటనలకు వెళ్లిన 1.43 కోట్ల మంది ఎవరో ప్రభుత్వానికి తెలియదా? అంతెందుకు, ప్రధాని విదేశీ పర్యటనల కోసం గత 12 సంవత్సరాలలో రూ.762 కోట్లు ఖర్చు చేసి, దేశ చరిత్రలో ఏ ప్రధాని చేయనన్ని పర్యటనలు చేసింది మోడీ కదా! ఉచిత బస్సు రూపంలో అరుదుగా వచ్చిన ఈ మాత్రం 'అదృష్టం' ఎంత కాలం వుంటుందోనని కష్టనష్టాలకు ఓర్చి కొందరు మహిళలు తీర్థయాత్రలు వెళుతుంటే, అనేకమంది సరిపడా బస్సులు లేక రోడ్లపై అవస్తలు పడుతున్న జనం ఏ విదేశీ పర్యటనలను వాయిదా వేసుకోవాలి? కనీస పౌష్టికాహారం లేక దేశంలోని మూడు నెలల నుండి ఆరు సంవత్సరాల లోపు వున్న బాలబాలికల్లో 71 శాతం, 15 నుండి 49 సంవత్సరాల మధ్య వున్న మహిళల్లో 59.2 శాతం మంది రక్తహీనతతో వున్నారు. వీరు వంటనూనె వాడకం ఎంత తగ్గించగలరు? దేహ సేవ, దేశ సేవ ఏమి చేయగలరు? సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌లో ఇచ్చిన ఫిర్యాదుల్లో (ఎ.పి పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ సిస్టమ్) 22 నుండి 50 శాతం లోపే ప్రజల సంతృప్తి వుందని ఒకవైపు చెబుతూనే, పొదుపు చర్యల్లో భాగంగా ఉద్యోగులు వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుండే ఉద్యోగం) చేయాలని చెబుతున్నారు. ఇదే అమలైతే ప్రజల బతుకులు పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్లు అవుతాయి. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధ పరిస్థితుల కంటే ముందు నుంచే, దేశ ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మోడీ ప్రభుత్వం విఫలమైందని భారత ఆర్థిక సూచీలు స్పష్టం చేస్తున్నాయి. బిజెపి మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ గతంలో స్వదేశీ ప్రచారం చేస్తూ యువత, మధ్యతరగతి ప్రజలను ఆకర్షించేది. అధికారంలోకి వచ్చిన తర్వాత దానికి విరుద్ధంగా దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను, సహజ వనరులను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ కంపెనీలకు గుండుగుత్తగా అప్పగిస్తుంది. మోడీ పాలనా కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి తగ్గిపోయి విదేశీ సరుకుల దిగుమతి పెరిగింది. కొత్త పరిశ్రమలు రాకపోవడం, నోట్ల రద్దు, కరోనా లాక్‌డౌన్ వల్ల చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడడంతో నిరుద్యోగం భారీగా పెరిగిపోయింది. భారత్ వస్తు వాణిజ్య లోటు 2023-24లో 241.1 బిలియన్ డాలర్ల నుంచి 2024-25 నాటికి 282.8 బిలియన్ల డాలర్లకు పెరిగింది. ఎగుమతుల కంటే దిగుమతులు వేగంగా పెరగడంతో వస్తు, సేవలు కలిపిన మొత్తం వాణిజ్య వ్యత్యాసం 2025-26లో మరింతగా పెరిగింది.

(మొదటిపేజీ తరువాయి)

## బుచ్చయ్యపేట తహసీల్దార్ కార్యాలయం ముట్టడి..





రైతులను భయభ్రాంతులకు గురిచేసి అన్యాయంగా వారి భూములను ఆక్రమించడంతో తమకు న్యాయం చేయాలంటూ మండల తహసీల్దార్ కు అనేకసార్లు ఫిర్యాదు చేసినప్పటికీ రెవెన్యూ అధికారులలో ఏమాత్రం చలనం లేకపోవడంతో గురువారం దళిత రైతులు గ్రామస్తులతో కలిసి మండల రెవెన్యూ కార్యాలయాన్ని ముట్టడించారు.

### రైతుల తరపున పోరాడితే అక్రమ కేసులా..?

దళిత రైతులుకు సంబంధించిన భూములు ఆక్రమించుకున్న వారిపై అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని రైతుల తరపున పోరాడి తన గళాన్ని వినిపించిన గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి అలియాస్ బుజ్జి పై అక్రమ కేసులు బనాయించడం తగదని దళిత మహిళ రైతులు తహసీల్దార్ కారుకు అడ్డంగా కూర్చొని నిరసన తెలియజేశారు. అదేవిధంగా ఆర్ భీమవరం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు173/11లో నాలుగు ఎకరాల డి పట్టా భూమి 22 ఏ లో ఉన్న భూమిని ఏ ప్రాతిపదికన జిరాయితి భూమిగా మార్పు చేశారని రైతులు ప్రశ్నించడంతో తాసిల్దార్ నోట మాట రాలేదు. తాసిల్దార్ కార్యాలయాన్ని అవినీతిమయం చేసిన ఇటువంటి అధికారులపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించకపోతే దళితుల భూములకు రక్షణ కరువవుతుందని ఇటువంటి అధికారులను తక్షణమే తొలగించాలని పలు దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

### సామాన్య ప్రజలు అంటే ఎందుకంత చులకన..

ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూములు ఆక్రమణకు గురవుతున్నాయని తమకు న్యాయం చేయాలంటూ గోడు వెల్లబుచ్చుకుంటున్న మహిళా రైతులను పట్టించుకోకుండా కారులో వెళ్లిపోవడం పట్ల తహసిల్దార్ తీరుపై ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పేద దళితుల భూమిని అన్యాయంగా గ్రామానికి చెందిన నాయకులకు కట్టబెట్టేందుకు తాసిల్దార్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుండడాన్ని గ్రహించి దళిత రైతులకు అండగా నిలబడిన మాజీ సర్పంచ్ మలిరెడ్డి బుజ్జి మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించే వరకు తాను రైతులు పక్షానే ఉంటూ రైతుల కోసం పోరాడుతానని ఎన్ని కేసులు పెట్టుకున్న భయపడేది లేదని రైతులకు సంబంధించిన భూములను రి సర్వే చేసి ఎవరి భూమి వాళ్ళకి అప్పగించకపోతే ధర్నాను ఉధృతం చేయడం జరుగుతుందని భూస్వాములకు కొమ్ముకాస్తున్న రెవెన్యూ యంత్రాంగం పై జిల్లా కలెక్టర్ దృష్టికి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని హెచ్చరించారు.

### ఆర్ భీమవరం మరో పెదమదిన కానుందా...!

ప్రశాంత పల్లె వాతావరణంతో గత చరిత్రను గమనిస్తే ఎటువంటి వివాదాలు లేకుండా ఉన్న బుచ్చయ్యపేట మండలం నేడు పలు వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతుంది. రెవెన్యూ కార్యాలయంలో అవినీతి మరకలు, వర్గ పోరాటాలతో మండలంలోని పెదమదిన గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న ఘటన రాష్ట్రంలోనే సంచలనం రేకెత్తించింది. ఇటువంటి వివాదాలకు తహసీల్దార్ వైఖరే కారణమని బహిరంగంగానే ఆరోపణలు ఆ నోటా ఈ నోట వినబడుతున్నాయి.

## చంద్రబాబు సమీక్షా సమావేశం

అనుమతులు మంజూరు చేయాలని, అవసరమైన భూ కేటాయింపులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. ప్రాజెక్టులు త్వరగా గ్రౌండింగ్ దశకు చేరి పరిశ్రమలు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావడం మాత్రమే కాకుండా, అవి వేగంగా అమలై యువతకు ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం చంద్రబాబు తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి వేగవంతం చేయడం ద్వారా ఆర్థిక వృద్ధిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశానికి సీఎస్ సాయిప్రసాద్‌తో పాటు మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, బీసీ జనార్దన్ రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో 3 కీలక ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం : ఎంపీ శ్రీభరత్

రూ. 1,501.03 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టులను అమలు చేయబోతున్నట్లు చెప్పారు. మధురవాడ జోన్ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ అభివృద్ధికి రూ. 658.61 కోట్లు, మధురవాడ జోన్‌లో స్మార్ట్ తాగునీటి సరఫరా వ్యవస్థ కోసం రూ. 725.18 కోట్లు, బల్క్ అండ్ సెమీ బల్క్ నీటి సరఫరా వ్యవస్థ ఆధునీకరణ కోసం రూ. 117.24 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టులు విశాఖపట్నం పట్టణ మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని తెలిపారు.

## నెదర్లాండ్స్ ప్రధానికి మోదీ అరుదైన కానుక

, ఆచార వ్యవహారాలు తదితర శుభకార్యాలకు సూచికగా ఈ పెయింటింగ్స్ వేస్తారు. ఈ మధుబని పెయింటింగ్స్‌కు సంబంధించిన మూలాలు భారతీయ పురాణాలు, జానపద కథల్లో ఉన్నాయి. పువ్వులు, పక్షులు, చెట్లు, చేపల వంటి ఆకృతుల ద్వారా దేవతలు, ప్రకృతితోపాటు రోజువారీ జీవిత దృశ్యాల ఈ పెయింటింగ్స్‌లో కనిపిస్తాయి. నెదర్లాండ్స్ ప్రధానికి ఈ కానుక ఇవ్వడం ద్వారా భారతీయ సంస్కృతి, ముఖ్యంగా మిథిలా కళారూపాన్ని పరిచయం చేసినట్లు అయిందనే చర్చ సాగుతోంది.

## నక్కపల్లిలో షైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం

### ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేసిన హోంమంత్రి అనిత



**నక్కపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో హోంమంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో షైనింగ్ స్టార్స్ అభినందన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. మొత్తం 103 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున సొంత నిధుల నుంచి నగదు బహుమతులు అందజేశారు. నగదు బహుమతితో పాటు సాలువా, మెమొంటో, ప్రశంసాపత్రాలను అందించి సత్కరించారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులను కూడా ఘనంగా సన్మానించి ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని మంత్రి అందజేశారు. విద్యార్థులకు మంచి ఫలితాలు తీసుకురావడంలో కృషి చేసిన ఉపాధ్యాయులను కూడా మంత్రి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్ కలిసి సత్కరించారు. గత సంవత్సరం కూడా పాయకరావుపేట నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సొంత నిధులతో ప్రోత్సాహకాలు అందించి సన్మానించినట్లు ఉపాధ్యాయులు గుర్తు చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఏపీ విద్యా వ్యవస్థ అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతోందన్నారు. వంద రోజుల ప్రణాళికలతో ఈసారి పదో తరగతి ఫలితాలు గతంలో ఎన్నడూ లేనంతగా వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థుల ఫోటోలను పత్రికల్లో ప్రకటనల రూపంలో ప్రచురించడం కూటమి ప్రభుత్వ ప్రత్యేకత అని చెప్పారు. గత ప్రభుత్వంలో విద్యార్థులకు నాసిరకం బ్యాగులు ఇచ్చారని విమర్శించారు. ఈసారి పదో తరగతి ఫలితాల్లో బాలికలే అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, ఆడపిల్లలు బంగారు తల్లులని కొనియాడారు. పిల్లల పెంపకంలో ఆడ, మగ తేడా చూపకూడదని, వారి ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న చిన్న తప్పిదాల వల్ల కొందరు విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన ఉండాలని, ప్రతి విద్యార్థికి ఒక స్పష్టమైన లక్ష్యం అవసరమని తెలిపారు. యువత కూడా రాజకీయాల్లోకి రావాలని హోంమంత్రి పిలుపునిచ్చారు.

## ఏపీలో ఎండల ఎఫెక్ట్.. మూడు రోజుల పాటు వడగాలుల హెచ్చరిక



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని విశాఖపట్నం తుపాను హెచ్చరికల కేంద్ర అధికారి జగన్నాథ్ కుమార్ తెలిపారు. రాబోయే మూడు రోజుల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వడగాలులు, కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్, మరికొన్ని ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు లేకపోతే మధ్యాహ్న సమయంలో బయటకు రావొద్దని సూచించారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, ఈ సమయంలో నీడ పట్టున ఉండాలని, తగినంత నీరు తాగాలని సూచించారు. కోస్తా ఆంధ్రా, రాయలసీమ ప్రాంతాల్లో అక్కడక్కడ తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందని జగన్నాథ్ కుమార్ తెలిపారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో వాతావరణ మార్పుల ప్రభావంతో స్వల్ప వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. నైరుతీ రుతుపవనాలపై కూడా కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం నైరుతీ రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని, ఈ నెల 26వ తేదీన కేరళం తీరాన్ని తాకే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం అవి ఆంధ్రప్రదేశ్ వైపు ముందుకు సాగే అవకాశముందని పేర్కొన్నారు. రుతుపవనాల రాకతో ఏపీలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. వడగాలుల నేపథ్యంలో చిన్నపిల్లలు, వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లే వారు తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, తరచూ నీరు, మజ్జిగ, పండ్ల రసాలు తీసుకోవడం మంచిదని చెబుతున్నారు.

## ఢిల్లీలో స్తంభించనున్న రవాణా!



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశ రాజధాని ఢిల్లీతో పాటు ఎన్ సిఆర్ పరిధిలో ప్రజా, వాణిజ్య రవాణా స్తంభించనుంది. ప్రభుత్వ సెస్సుకు నిరసనగా మూడురోజుల పాటు సమ్మె చేపట్టనున్నట్లు రవాణా , టాక్సీ యూనియన్లు గురువారం ప్రకటించాయి. వాణిజ్య వాహనాలపై పర్యావరణ నష్టపరిహార సెస్సును పెంచాలన్న ఢిల్లీ ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మే 23 వరకు ఈ సమ్మె చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా మోటార్ ట్రాన్స్ పోర్ట్ కాంగ్రెస్ (ఎఐఎంటిసి) ఒక ప్రకటనలో తెలిపింది. ట్రక్కులు, ప్రైవేట్ బస్సులు, టాక్సీ, క్యాబ్ ఆపరేటర్లు దీనిలో భాగస్వామ్యులుగా ఉన్నారు. రవాణా రంగంపై వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సిఎక్యూఎం), కోర్టులు, ఢిల్లీ ప్రభుత్వం విధించిన అన్యాయమైన, పక్షపాత విధానాలన వ్యతిరేకిస్తున్నట్లు యూనియన్ ఒక ప్రకటనలో తెలిపింది. పెరుగుతున్న ఇంధన ధరల దృష్ట్యా టాక్సీ, ఆటో ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేస్తూ, ఢిల్లీలోని వాణిజ్య వాహన డ్రైవర్ల సంఘాలు కూడా ఈ సమ్మెకు మద్దతు తెలిపాయి.

# అర్జీలను వెంటనే పరిష్కరించాలి: కలెక్టర్ నిషాంతి



దుంబ్రిగుడ, పతాకం న్యూస్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ నిషాంతి ఆదేశించారు. డుంబ్రిగుడ ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా స్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ నిషాంతి, జాయింట్ కలెక్టర్ టి.శ్రీపూజ, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 88 అర్జీలు వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పీజీఆర్ఎస్ నోడల్ అధికారి కేఆర్ ఆర్సీ స్పెషల్ డిప్యూటి కలెక్టర్ నీలకంఠరావు, జిల్లా పరిషత్ సీఈవో, ఐటీడీఏ ఏపీవో, జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు టికిలిబెడ్డ గ్రామంలో ఉపాధి హామీ పథకం శ్రామికులతో కలెక్టర్ మాట్లాడారు. వారు చేసిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల భాగస్వామ్యమే ప్రభుత్వ బలమని, కలిసికట్టుగా గ్రామాలను ప్రగతి పథంలో నడిపించి ఆదర్శవంతమైన స్వయం సమృద్ధి గ్రామాలుగా మార్చుకుందామని కలెక్టర్ నిషాంతి పిలుపునిచ్చారు. కించుమండ పంచాయతీ కేంద్రంలో జన్ భాగీదారీ అభియాన్ ప్రత్యేక సేవా శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే అవసరం లేకుండా అన్నీ శాఖలు స్వయంగా గ్రామాల్లోకొచ్చి సేవలు అందించేలా ప్రభుత్వం మీ ఇంటి ముంగిటకే కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమశాఖ డిప్యూటి డైరెక్టర్ పరిమళ, అధికారులు పాల్గొన్నారు.

## విశాఖలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో
# ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి వేడుకలు



విశాఖపట్నం, పతాకం న్యూస్: మాజీ ప్రధాని భారతరత్న రాజీవ్ గాంధీ 34వ వర్ధంతి వేడుకలు విశాఖలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు హాసిని వర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు హాసిని వర్మ మాట్లాడుతూ, "రాజీవ్ గాంధీ కేవలం ఒక రాజకీయ నాయకుడు కాదు, ఈ దేశానికి ఆధునికతను పరిచయం చేసిన దార్శనికుడు. 21వ శతాబ్దపు భారతదేశానికి పునాదులు వేసిన మహానేత ఆయన అని అన్నారు. కంప్యూటర్లు, టెలికాం రంగాన్ని గ్రామాలకు తీసుకెళ్లి డిజిటల్ ఇండియాకు బాటలు వేశారు. ఈరోజు మన చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ వెనుక ఆయన దూరదృష్టి ఉంది. ఓటు హక్కు వయసును 21 నుంచి 18కి తగ్గించి యువతను ప్రజాస్వామ్యంలో భాగస్వాములను చేశారు. అధికారాన్ని వికేంద్రీకరించి గ్రామాల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించి మహిళా సాధికారతకు బీజం వేశారు. దేశ సమగ్రత కోసం, శాంతి కోసం తన ప్రాణాలనే అర్పించిన అమరజీవి రాజీవ్ గాంధీ. ఆయన కలలు కన్న సాంకేతిక భారతం, శక్తివంతమైన యువ భారతం దిశగా కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పనిచేస్తుంది. రాజీవ్ గాంధీ ఆశయాల సాధన కోసం ప్రతి కార్యకర్త పునరంకితం కావాలి" అని పిలుపునిచ్చారు. రాజీవ్ గాంధీ చేసిన సేవలను స్మరించుకుంటూ కాంగ్రెస్ శ్రేణులు ప్రతిజ్ఞ చేశాయి. ఈ కార్యక్రమంలో పి సి సి కార్యదర్శి గాదం మహేష్,మహిళా నాయకురాలు కండవ గాయత్రి, సీనియర్ నాయకులు విజయ్, జిల్లా కార్యదర్శి వంకర ఆనంద్ కుమార్, ఎస్సీ సెల్ కస్తూరి వెంకట రావు, ఆఫీస్ ఇంచార్జి సబ్బవరపు శ్రీధర్, కృష్ణ, మధు, కొమారపు చైతన్య, సురేష్ , సత్యనారాయణ,కార్యకర్తలు పాల్గొన్నారు.

# మధురవాడలో ఘోరం.. వివాహితపై హత్యాయత్నం..

## మెడకు వైరు చుట్టి గ్రేహౌండ్స్ పరిసరాలలో పడేసిన ప్రియుడు



విశాఖపట్నం, పతాకం న్యూస్: వివాహేతర సంబంధం ఓ వివాహిత ప్రాణాల మీదికి తెచ్చింది.క్షణికావేశంలో ప్రియుడే ఆమెను అంతమొందించాలని చూసిన ఘోర ఉదంతం భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది.మెడకు ప్లాస్టిక్ కోటెడ్ ఐరన్ వైరు బిగించి,చావుబతుకుల మధ్య ఉన్న మహిళను పోలీసులు,స్థానికులు కాపాడిన ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. పోలీసులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మధురవాడ,వైఎస్సార్ కాలనీకి చెందిన ఆశ (27) అనే మహిళకు ఇదివరకే వివాహమై ఒక సంతానం ఉంది.భర్తతో వచ్చిన విభేదాల కారణంగా ఆమె దూరంగా ఉంటోంది.ఈ క్రమంలో మధురవాడ స్వతంత్రనగర్ ప్రాంతానికి చెందిన కొయ్య కార్తీక్(29) అనే వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడింది. కార్తీక్‌కు కూడా ఇదివరకే వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు.అయినప్పటికీ.. గత ఐదేళ్లుగా వీరిద్దరూ సహజీవనం సాగిస్తున్నారు. గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య తీవ్ర మనస్పర్ధలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.?మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2గంటల సమయంలో ఇద్దరి మధ్య గొడవ పెద్దదైంది.దీంతో ఆగ్రహానికి గురైన కార్తీక్,ఆశ ను హతమార్చాలనే ఉద్దేశంతో ఆమె మెడకు ప్లాస్టిక్ కోటెడ్ ఐరన్ వైరు గట్టిగా చుట్టి ఊపిరాడకుండా చేశాడు.ఆమె స్పృహ కోల్పోవడంతో చనిపోయిందని భావించిన కార్తీక్,గ్రేహౌండ్స్ సమీపంలోని భావికొండ ప్రాంతంలో పడేశాడు.అనంతరం అర్ధరాత్రి సమయంలోనే తన బావకు ఫోన్ చేసి,నేను ఆశను చంపేశాను అంటూ ఒక వాయిస్ మెసేజ్ పంపి పరారయ్యాడు.?విషయం తెలుసుకున్న కార్తీక్ బావ వెంటనే భీమిలి పోలీసులను ఆశ్రయించి,సదరు వాయిస్ మెసేజ్ వివరాలను సీఐ కు అందజేశారు.దీంతో భీమిలి సీఐ తిరుమలరావు ఆధ్వర్యంలో పోలీసులు రాత్రంతా భావికొండ, గ్రేహౌండ్స్ అటవీ పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయంలో దట్టమైన చీకటి కారణంగా ఆమె ఆచూకీ లభించలేదు. బుధవారం తెల్లవారుజామున జీవీఎంసీ 4వ వార్డు పరిధిలోని కాపుల ఉప్పాడ ఊడా లేఅవుట్,గ్రేహౌండ్స్ పరిసర ప్రాంతంలో ఆశ అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు,అటుగా వెళ్తున్నవారు వెంటనే 108 అంబులెన్స్‌కు,పోలీసులకు సమాచారం అందించారు. మెడకు వైరు గట్టిగా చుట్టుకుని కోన ఊపిరితో ఉన్న బాధితురాలిని పోలీసులు తక్షణమే చికిత్స నిమిత్తం గీతం హాస్పిటల్‌కు తరలించారు.ప్రస్తుతం ఆమె అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతోంది.ఈఘాతుకానికి ఒడిగట్టిన నిందితుడు కొయ్య కార్తీక్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.భీమిలి సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు.నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# యారాడ కొండపై ఐటీ పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి



గాజువాక, పతాకం న్యూస్: గాజువాక నియోజకవర్గంలో ఐటీ, ఇతర పరిశ్రమల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఇతర అధికారులను కోరినట్టు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్ తన ఛాంబర్‌లో ఎమ్మెల్యే పల్లాతో కలిసి గాజువాక నియోజకవర్గ సమస్యలపై పలు శాఖల అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం విలేకరులతో పల్లా మాట్లాడుతూ యారాడ కొండపై 400 ఎకరాల్లో ఐటీ, ఐటీ ఆధారిత, పరిశ్రమలకు కేటాయిస్తే స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. అలాగే గాజువాకలో ఏళ్ల కిందట గెడ్డలు, వాగులకు ఆనుకుని నిర్మించిన ఇళ్లను క్రమబద్ధీకరించాలని కోరారు. దీనివల్ల గాజువాకలో సుమారు ఆరు వేల కుటుంబాలు ప్రయోజనం పొందుతాయన్నారు. గాజువాకలో మీడియా ముసుగులో కొందరు ముఠాలుగా ఏర్పడి ఇళ్లు నిర్మిస్తున్న వారిని ఇబ్బంది పెడుతున్నారని పల్లా ఆందోళన వ్యక్తంచేశారు. అటువంటి వారిపట్ల జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించేలా అధికారులు చొరవ తీసుకోవాలని పల్లా శ్రీనివాసరావు కోరారు. ఇంకా 600 మంది నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఉక్కు భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ పేర్కొన్నారని, అయితే నిర్వాసిత కాలనీల్లో ఆక్రమణలు, మిగిలిన ఇళ్ల స్థలాలు, ఇంకా ఎంత మందికి ఉద్యోగాలు ఇవ్వాలి?, సబ్ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నమోదైన వివరాలపై ఒక నివేదిక సిద్ధం చేయాలని కోరారు. ఉక్కు భూసేకరణ విభాగం డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం పనితీరు మార్చుకోవాలన్నారు. ఫార్మా సిటీ నిర్వాసితుల్లో ఇంకా 300 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతున్న నేపథ్యంలో ఏపీఐఐసీ అధికారులు చొరవ తీసుకుని వారి సమస్య పరిష్కరించాలన్నారు. అగనంపూడి టోల్‌గేటు సమీపాన ఏపీ రిఫ్రాక్టరీస్‌కు చెందిన 175 ఎకరాల భూమిని వినియోగించాలని, లేకపోతే ఆక్రమణలకు గురవుతుందన్నారు.

# రూ.30 లక్షలతో ఆయుర్వేద ఆసుపత్రి ఆధునికీకరణ




అరకులోయ, పతాకం న్యూస్: అరకులోయ టీటీడీ కల్యాణ మండపాన్ని ఆనుకుని ఉన్న ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి భవనం కొత్త రూపు సంతరించుకుని పునఃప్రారంభానికి సిద్ధమైంది. నాలుగు నెలల కిత్రం ఈ ఆస్పత్రి భవనం మరమ్మతులకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నేషనల్ ఆయూష్ మిషన్ నుంచి రూ.30 లక్షలు మంజూరయ్యాయి. మెడికల్ సైన్సెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి. భవనాన్ని సరికొత్తగా తయారు చేశారు. ఇది ఇప్పుడు పునఃప్రారంభానికి సిద్ధంగా ఉంది.

# ఉక్కునగరం శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మూగజీవులకు దాహ నివారణ సేవ

గాజువాక, పతాకం న్యూస్: తీవ్రమైన ఎండల నేపథ్యంలో మూగజీవుల పట్ల కరుణాభావంతో ఉక్కునగరం శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు విశిష్ట సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉక్కునగరం సెక్టార్-2లోని శ్రీ సత్యసాయి మందిరం బయట ప్రతిరోజూ కుండల్లో స్వచ్ఛమైన తాగునీటిని ఏర్పాటు చేసి ఆవులు, గేదెలు, కుక్కపిల్లలు తదితర మూగజీవుల దాహాన్ని తీర్చుతున్నారు. అలాగే, మండుతున్న వేసవి వేడిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా ప్రతిరోజూ వేలాది మంది ప్రజలకు చల్లని తాగునీరు అందిస్తూ సేవలందిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమం స్థానిక ప్రజల ప్రశంసలను అందుకుంటోంది. పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన పశువులు ఈ నీటిని తాగుతూ ఉపశమనం పొందుతున్న దృశ్యాలు అందరినీ కదిలిస్తున్నాయి. "మానవ సేవే మాధవ సేవ" అనే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ సమితి సభ్యులు ఈ సేవను నిరంతరం కొనసాగిస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు ప్రశంసిస్తూ, మూగజీవుల పట్ల ప్రేమాభిమానాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని కోరుతున్నారు.

# మాకవరపాలెంలో 'బ్లాక్ స్టోన్' కంపెనీ



మాకవరపాలెం, పతాకం న్యూస్: మండలంలో ఇటీవల రెవెన్యూ అధికారులు గుర్తించిన 4,250 ఎకరాల ల్యాండ్ బ్యాంకు భూములను ఏపీఐఐసీ అధికారుల ఆధ్వర్యంలో ఒక ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. మూడు నెలల కిందట పైడిపాల, పాపయ్యపాలెం, పెద్దిపాలెం, బూరుగుపాలెం గ్రామాల్లో 4,250 ఎకరాల డి.పట్టా భూములతోపాటు ప్రభుత్వ భూములను ల్యాండ్ బ్యాంకు కింద అధికారులు గుర్తించారు. అయితే ఆయా రైతులతో ఇంతవరకు సమావేశాలు నిర్వహించలేదు. ఈ నేప?థ్యంలో బుధవారం ఒక ప్రైవేటు కంపెనీ ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు ఇక్కడకు వచ్చి భూములను పరిశీలించడంతో రైతుల్లో కలకలం మొదలైంది. అయితే ఈ నాలుగు గ్రామాల్లో భూములను ప్రభుత్వం తీసుకోవడం ఖాయమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఇందులో 450 ఎకరాలను బ్లాక్ స్టోన్ ఇంక్ అనే కంపెనీ తీసుకుంటున్నట్టు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహహారావు తెలిపారు. భూములను పరిశీలించిన వారిలో తహశీల్దారు లోకవరపు రామారావు, డీటీ రాజ్‌భరత్, మండల సర్వేయరు వెంకటేశ్వరరావు తదితరులు వున్నారు.

# గృహ గణన గడువులోగా పూర్తి చేయాలి



అనకాపల్లి, పతాకం న్యూస్: జిల్లాలో జరుగుతున్న గృహ గణన సర్వే ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జనాభా గణన విభాగం జాయింట్ డైరెక్టర్ దయాసాగర్, జిల్లా ఇన్‌చార్జి జోషిణి కలెక్టర్‌ను ఆమె చాంబర్‌లో కలిశారు. గృహ గణన ఇంతవరకు 80 శాతం పూర్తయ్యిందని, ఈ నెల 30వ తేదీనాటికి శతశాతం గృహ గణన పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ వారిని ఆదేశించారు. 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తాళాలు వేసి వున్న ఇళ్లు, ఖాళీగా ఉన్న ఇళ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ చేపడతామని జాయింట్ డైరెక్టర్ దయాసాగర్ వివరించారు.

# స్వచ్ఛ రథానికి గ్రామీణ ప్రాంతాల్లో విశేష ఆదరణ



పెదబయలు, పతాకం న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా ప్రవేశపెట్టిన స్వచ్ఛరథానికి గ్రామీణ ప్రాంతాల్లో విశేష ఆదరణ లభిస్తోంది. గ్రామాలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు ప్లాస్టిక్ నిర్మూలనకు ఈ రథాలు దోహదపడుతున్నాయి. మండలంలోని 23 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో స్వచ్ఛరథం తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తోంది. ప్లాస్టిక్ నియంత్రణ, వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. గ్రామాల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువల్లో, ఖాళీ ప్రదేశాల్లో పడేయడంతో దుర్వాసన, దోమల వ్యాప్తి, పర్యావరణ కాలుష్యం వంటి సమస్యలు తీవ్రంగా ఉంటున్నాయి. ప్రధానంగా వారపు సంతలు జరిగే పెదబయలు, రూఢకోట, గోమంగి గ్రామాల్లో చెత్త నిర్వహణ పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక ప్రణాళికతో రాష్ట్ర వ్యాప్తంగా స్వచ్ఛరథాల సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ప్రజల నుంచి ప్లాస్టిక్, పాత పుస్తకాలు, ఇనుప సామగ్రి, తదితర వస్తువులను కిలోల లెక్కన కొనుగోలు చేస్తున్నారు. బరువును బట్టి నిత్యావసరాలు ఇవ్వడం, లేదా నగదు చెల్లిస్తున్నారు. స్వచ్ఛరథం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు.

# ఎండల తీవ్రతపై అందరూ అప్రమత్తంగా ఉండాలి

## విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, పతాకం న్యూస్: జిల్లాలో కొనసాగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలుపై గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్న వేళల్లో బయట తిరగవద్దని, ఈ మేరకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. చలివేంద్రాల్లో తగినంత తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్, ఎంపీడీవోలకు సూచించారు. ప్రైవేట్ సేవా సంస్థలు నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కేంద్రాల నిర్వహణలో సమన్వయం పాటించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ, భవన నిర్మాణం తదితర పనుల్లో పాల్గొనే కార్మికులకు తగిన రక్షణ చర్యలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల ప్రదేశాల్లో నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కార్మికులకు ఉపశమనం కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పని నిర్వహించాల్సి వస్తే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. యూపీహెచ్సీ, పీహెచ్సీల్లో వడదెబ్బ బాధితుల కోసం ప్రత్యేక బెడ్లు సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్వోకు సూచించారు. గర్భిణీలు, వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.

# ఆలయ ప్రహరీ నిర్మాణంలో వివాదం..



**సోంపేట, పతాకం న్యూస్:** రామయ్యపట్నంలో దశాబ్దాలు గా గ్రామస్థులు పూజిస్తున్న వరసండి అమ్మవారి ఆలయ ప్రహరీ నిర్మిస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు. దీంతో గ్రామస్థులు, అటవీ సిబ్బంది మధ్య వాగ్వాదం జరి గింది. వివరాలిలా ఉన్నాయి.. వరసండి అమ్మవారి ఆలయానికి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి పనులు ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అటవీశాఖ ప్రత్యేకాధి కారి బిందు, గొల్లగండి బీట్ ఆఫీసర్ సంతోష్ అక్కడికి చేరు కుని ఇది అటవీ భూమి అని, ఇందులో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్నారు.

అయితే దీనికి గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ దశాబ్దాలుగా ఇక్కడ గుడి ఉందని, దీనికి ప్రహరీ నిర్మాణానికి గ్రామస్థు లంతా కలిసి నిర్ణయం తీసుకుని పనులు చేపట్టామని, అడ్డుకునే హక్కు మీకు లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఈ సమస్య ఎమ్మె ల్యే బెందాళం అశోక్ దృష్టికి వెళ్లిందని, ప్రహరీ నిర్మాణానికి అడ్డు తగలడం సమంజసం కాదని ఎమ్మెల్యే అటవీ అధికారు లకు తెలిపారని ఎంపీటీసీ మాజీ సభ్యుడు నిట్ట గోపాల్, వి.కృష్ణా రావు, బి.ఎర్రయ్య పేర్కొన్నారు. గ్రామస్థుల నుంచి వ్యతిరేకత పెరగడంతో అటవీ అధికారులు వెనుదిరిగారు. కార్యక్రమంలో నీలవేణి, దుర్గ, లోకనాథం, రమణ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆసరా




**లక్కవరపుకోట, పతాకం న్యూస్:** పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా ఉంటోం దని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. లక్కవరపుకోటలో తొమ్మిది మందికి రూ.6 లక్షల 62వేల, 750లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుపేద కుటుంబాల ఆరోగ్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ఇతోదికంగా సహాయపడుతోందన్నారు. ఇప్పటివరకు రెండేళ్ల కాలవ్యవధిలో మూడున్నర కోట్ల రూపాయలు పేదలకు కూటమి ప్రభుత్వం అందజేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఒక్కపైసా కూడా ఇవ్వలేదని విమర్శించారు. కార్పొరేట్ స్థాయి వైద్యం అందుకోలేని పేదలకు సీఎం ఆర్ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వాహక మాజీ కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, పార్టీ మండలాధ్యక్షులు కరెడ్ల ఈశ్వర రావు, చొక్కాకుల మల్లునాయుడు, పీవీ రత్నాజీ, కోళ్ల శ్రీను పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌లో మన్యం ముందంజ



**పాలకొండ, పతాకం న్యూస్:** గర్భాశయ క్యాన్సర్ నుంచి బాలికలకు రక్షణ కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హెచ్‌పీవీ(హ్యూమన్ పాపిల్లో మావైరస్) వ్యాక్సినేషన్‌లో మన్యం జిల్లా తన ప్రత్యేకతను చాటుకుంది. 14 ఏళ్లలోపు 9,600 మంది బాలికలకు వ్యాక్సిన్ వేయాలని గుర్తించగా ఇప్పటివరకు 6,300 మందికి హెచ్‌పీవీ వేశారు. దీంతో రాష్ట్రంలోనే మన్యం జిల్లా మూడో స్థానంలో నిలిచినట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు. వాస్తవంగా మార్చి 10 నుంచి జిల్లాలో ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. కాగా ఇప్పటికీ క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది బాలికలు, వారి తల్లిదండ్రులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అవ గాహన కల్పిస్తూ ముందుకు సాగుతున్నారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతా ల్లోనూ బాలికలకు ఈ వ్యాక్సిన్‌ను వేస్తున్నారు. ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించి హెచ్‌పీవీ వ్యాక్సిన్ ఆవశ్యకతను వివరిస్తున్నారు. '11 నుంచి 14 ఏళ్లలోపు బాలికలు విధిగా వ్యాక్సిన్ వేసుకోవాలి. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల ద్వారా ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేశాం. ఈ వ్యాక్సిన్‌పై ప్రజలు అపోహలు వీడాలి. ఈ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల బాలికలు భవిష్యత్‌లో క్యాన్సర్ నుంచి రక్షణ పొందొచ్చు. ' అని డీఎంహెచ్‌వో భాస్కరరావు తెలిపారు.

## గుడివాడలో వేంకటేశ్వరస్వామి బంగారు కిరీటం తాకట్టు



**కృష్ణా జిల్లా, పతాకం న్యూస్:** కృష్ణా జిల్లా గుడివాడలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సెంటిమెంట్‌తో ముడిపడిన ఒక షాకింగ్ మోసం వెలుగులోకి వచ్చింది. స్వామివారి బంగారు కిరీటాన్ని, ఆలయ కమిటీ సభ్యులు తమ సొంత అవసరాల కోసం గుట్టుచప్పుడు కాకుండా బ్యాంకులో తాకట్టు పెట్టి భారీగా డబ్బులు డ్రా చేసుకున్నారు. మాటూరు సుబ్బారావు అనే దాత 2025లో సుమారు రూ. 70 లక్షల విలువైన బంగారు కిరీటాన్ని స్వామివారికి విరాళంగా సమర్పించారు. అయితే, ఇటీవల కాలంలో స్వామివారికి ఆ కిరీటాన్ని అలంకరించకపోవడంతో అనుమానం వచ్చిన దాతలు ఆలయ కమిటీని నిలదీశారు. దీంతో అసలు విషయం బయటపెట్టిన కమిటీ సభ్యులు.. ఆ కిరీటాన్ని రూ. 38 లక్షలకు తాకట్టు పెట్టినట్లు అంగీకరించారు. ఈ వ్యవహారంపై దాత సుబ్బారావు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి సమక్షంలో స్వామివారికి బహూకరించిన కానుకలతో ఇలా వ్యాపారం చేయడంపై భక్తులు మండిపడుతున్నారు. ఈ వంచనపై తాము పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ, సివిల్ వ్యవహారంగా పేర్కొంటూ కోర్టుకు వెళ్లమని పోలీసులు సూచించారని దాత ఆరోపించారు. ఆలయ పవిత్రతను దెబ్బతీసిన ఈ కమిటీ నుండి ఆ బంగారు కిరీటాన్ని వెంటనే రికవరీ చేసి తమకు అప్పగించాలని, దాన్ని భక్తుల నమ్మకాన్ని కాపాడే మరో మంచి ఆలయానికి సమర్పిస్తామని దాతలు స్పష్టం చేస్తున్నారు. భగవంతుడి సొత్తును సైతం పక్కదారి పట్టించిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది.

## సచివాలయ సిబ్బంది కొరత.. ప్రభుత్వ సేవలందక ప్రజల అవస్థలు

**అనంతపురం, పతాకం న్యూస్:** ఆత్మకూరు మండల వ్యాప్తంగా పంచాయతీలోని గ్రామ సచివాలయంలో అసలు సేవలు ప్రజలకు అందుతున్నాయా ? లేదా ? అనే సందేహం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది లేక ప్రజలు ప్రభుత్వ పథకాలు పెట్టుకోవటానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల స్థలాలు, క్యాస్ట్ ఇన్కమ్ సర్టిఫికెట్ వన్ బి అడంగల్ కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు ఇతర సేవలకు సచివాలయాల చుట్టూ తిరిగి ప్రజలు అలసిపోతున్నారు. సచివాలయానికి సిబ్బంది లేక తాళాలు వేస్తున్న పరిస్థితి నెలకొంది. సచివాలయంలో సిబ్బంది లేక, ప్రజలకు సేవలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

## వెలుగు అధికారుల పనితీరుపై సభ్యులు ఆగ్రహం



**గరుగుబిల్లి, పతాకం న్యూస్:** మండలంలోని వెలుగు అధికారుల పనితీరుపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. నాగూరు ఎంపీ టీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో వెలుగు శాఖ అవినీతిమయమైందన్నారు. మండల సమాఖ్య ఏకపక్షంగా వ్యవహరి స్తోందన్నారు. ఆర్థికంగా మహిళలను ఆదుకోవాల్సిన సంఘాలు మహిళలను శక్తిహీనులుగా మారుస్తున్నారన్నారు. స్త్రీనిధి మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయన్నారు. వెలుగులో అవకతవకలపై విచారణ చేయాలని అధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశామన్నారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల పరిధిలోని ప్రధాన కాలువల్లోని పూడికతీత, పిచ్చి మొక్కలు తొలగింపు నకు ఉపాధి నిధులు మంజూరు చేయాలని సభ్యులు ఈ సందర్భంగా తీర్మానించారు. జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీడీవో పి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సమావేశంలో జడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, ఎంపీడీవో పి.పైడితల్లి, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు, ఏవో జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

## రీసర్వే వేగవంతంగా పూర్తి చేయాలి



**రేగిడి, పతాకం న్యూస్:** రీసర్వే వేగవంతంగా పూర్తి చేయాలని చీపురుపల్లి ఆర్డీవో సుధారాణి కోరారు. మండలంలో లచ్చన్నవలస గ్రామంలో నిర్వహించిన రీ-సర్వేను ఆమె క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రౌండ్ ట్రూత్ ప్రక్రియను ఆమె ఆరా తీశారు. రైతుల నుంచి ఈకేవైసీ పూర్తి చేసి సర్వే చేయాలని, సర్వే ప్రక్రియ పక్కాగా ఉండాలని ఆమె ఆదేశించారు. లచ్చన్నవలస రెవెన్యూలో ఉన్న భూముల వివరాలను ఆమె తహసీల్దారు ఈశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఐదో ఫేజ్‌లో ఆరు గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేలో ఎటువంటి లోపాలు లేకుండా సిబ్బంది బాధ్యత వహించాలని ఆమె సూచించారు. ఆమె వెంట డీఐఓ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

## తెలంగాణలో కార్మికుల కనీస వేతనాలు పెంపు : రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో కార్మికులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శు భవార్త చెప్పారు. కార్మికుల కనీస వేతనాల పెంపుపై కేబినెట్ సబ్ కమిటీ నివేదిక మేరకు తీసుకున్న నిర్ణయాలను సిఎం మీడియాకు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. "బిఆర్ఎస్ హయాంలో కార్మికులకు కనీస వేతనాలు నిర్ణయించకపోవడం వల్ల 1.11 కోట్ల మంది నష్టపోయారు. కనీస వేతన పెంపుపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ అన్ని వర్గాలతో సంప్రదింపులు జరిపి కీలక సిఫార్సులు చేసింది. అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హై స్కిల్డ్ కేటగిరీలుగా విభజించింది. కార్మికుల వేతనాలు నిర్ణయించేందుకు జోన్లను మూడు జోన్లుగా విభజించాం. జోన్-1 మున్సిపల్ కార్పొరేషన్లు, జోన్-2 మున్సిపాల్టీలు, జోన్ -3 కింద గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి. జోన్ -1లో అన్‌స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు, సెమీ స్కిల్డ్ కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ.17 వేలకు, స్కిల్డ్ కార్మికుల వేతనాన్ని రూ.13,772 నుంచి రూ.18,500కి, హై స్కిల్డ్ కార్మికులకు రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుంది." అన్నారు.

## ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం



**విజయనగరం, పతాకం న్యూస్:** ఉపాధి హామీ పథకం అమలులో జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. అధిక సంఖ్యలో వేతనదారులకు పని కల్పించడం ద్వారా ఈ గుర్తింపు సాధించింది. రోజూ సుమారు 2.43 లక్షల మంది పనులకు హాజరవుతున్నారు. జలధార-జలహారతి కింద పనులను ముమ్మరంగా చేపడుతున్నారు. ఫిష్ పాండ్ల అభివృద్ధి భవిష్యత్‌లో వ్యవసాయానికి ఇతోధికంగా దోహదపడనుంది. జిల్లాలోని ఫిష్ పాండ్లలో మొత్తం 1,265 పనులను గుర్తించగా 1,068 పనులకు పరిపాలన అనుమతులు లభించాయి. ప్రస్తుతం 146 పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. మరో 51 పనులు పూర్తయ్యాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం కనీసం 60 శాతం పనులను వ్యవసాయ, అనుబంధ రంగాలకు కేటాయించాలి. ఇందులో భాగంగానే చేపల చెరువుల తవ్వకం పనులను చురుగ్గా చేపట్టారు. వేసవి కాలంలో ఇతర వ్యవసాయ పనులు లేకపోవడంతో జిల్లాలో ఉపాధి హామీ పనులకు వేతనదారుల నుంచి భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ తరుణంలో శ్రామికులకు చేతి నిండా పని కల్పిస్తూనే మరో వైపు భూగర్భ జల మట్టాలను పెంచాలనే ద్వంద్వ లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రతి మండలంలో ఈ ఫిష్ పాండ్ పనులను ప్రతిష్టాత్మకంగా ప్రారంభించింది. గతంలో బొబ్బిలి మండలం పారాది గ్రామ పంచాయతీలో తవ్విన చేపల చెరువు ద్వారా అద్భుతమైన ఫలితాలు రాగా అదే అనుభవంతో ఇప్పుడు చాలా మండలాల్లో ఈ పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు. వర్షాకాలం నాటికి ఈ ఫిష్ పాండ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయనున్నారు. తద్వారా వర్షపు నీటిని సమర్థంగా సంరక్షించి, భూగర్భ జలాలను పెంపొందించడానికి వీలు కలుగుతుంది.

## పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టుల భర్తీ




**పార్వతీపురం, పతాకం న్యూస్:** జిల్లాలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులు భర్తీ కోసం ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు కలెక్టరేట్‌లో అంగన్‌వాడీ నాన్-టీస్పీ పోస్టుల అభ్యర్థులకు జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పారదర్శకంగా అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బలిజిపేట, కొమరాడ, పాలకొండ, భామిని మండలాల్లో మొత్తంగా 31 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలకు 65 మంది మహిళా అభ్యర్థులు హాజరయ్యారని ఆయన వెల్లడించారు. పోస్టుల భర్తీ ప్రక్రియ అంతా నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం జరుగుతుందన్నారు. ఫలితాల ప్రకటనపై సెలక్షన్ కమిటీ చైర్మన్ తుది నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అంతకముందు సెలక్షన్ కమిటీ సభ్యులు, అధికారుల బృందం అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

## ఎండల తీవ్రతపై అందరూ అప్రమత్తంగా ఉండాలి

### విశాఖ జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** జిల్లాలో కొనసాగుతున్న ఎండ తీవ్రత దృష్ట్యా ప్రజల రక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలుపై గురువారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు మధ్యాహ్న వేళల్లో బయట తిరగవద్దని, ఈ మేరకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. చలివేంద్రాల్లో తగినంత తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్, ఎంపీడీవోలకు సూచించారు. ప్రైవేట్ సేవా సంస్థలు నిర్వహిస్తున్న మజ్జిగ పంపిణీ కేంద్రాల నిర్వహణలో సమన్వయం పాటించాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ, భవన నిర్మాణం తదితర పనుల్లో పాల్గొనే కార్మికులకు తగిన రక్షణ చర్యలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు. పనుల ప్రదేశాల్లో నీడ, తాగునీరు ఏర్పాటు చేయాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య కార్మికులకు ఉపశమనం కల్పించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పని నిర్వహించాల్సి వస్తే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సేవలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

## ఫేస్ యాప్ రద్దు చేయాలని 'ఉపాధి' కార్మికుల ఆందోళనలు



**అమరావతి, పతాకం న్యూస్:** ఉపాధి కార్మికులకు ఫేస్ యాప్ రద్దు చేయాలని, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి నిధులు పెంచాలని, విబి గ్రామ్ జీ పథకాన్ని రద్దు చేయాలని కోరుతూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఉపాధి కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సచివాలయాల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల ధర్నా చేశారు. సచివాలయ అధికారులకు వినతిప్రతాలు అందజేశారు. ఫేస్ యాప్ రద్దు చేసి పాత పద్ధతినే కొనసాగించాలని, పని కోరిన ప్రతి ఉపాధి కార్మికుడికీ వెంటనే పని కల్పించి వలసలను నివారించాలని, వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని, విబి గ్రామ్‌జీ పథకాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పక్బందీగా అమలు చేయాలని ఈ వినతిపత్రంలో కోరారు. ఫేస్ యాప్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను సోదాహరణంగా వివరించారు. ఫేస్ యాప్ రద్దు చేయాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామపంచాయతీ ఉపాధి హామీ పని ప్రదేశంలో ఉపాధి కార్మికులతో ఆయన మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి సరిపడా నిధులు కేటాయించకపోవడంతో గ్రామీణ పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉపాధి హామీ చట్టంలో మార్పుల వల్ల కార్మికులకు పని దొరకడం కష్టమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫేస్ యాప్ విధానం కారణంగా నెట్‌వర్క్ సమస్యలతో కార్మికులు గంటల తరబడి పని స్థలాల్లో వేచి ఉండాల్సి వస్తోందన్నారు. వేసవి కాలంలో కార్మికులకు సమ్మర్ అలవెన్స్, మంచినీటి సౌకర్యం, మెడికల్ కిట్లు, టెంట్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని, ప్రతి కుటుంబానికీ 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండల కేంద్రంలోని సచివాలయానికి ఉపాధి కార్మికులు ఆందోళనకు దిగారు. సచివాలానికి తాళం వేసి నిరసన తెలిపారు. కె.కోటపాడు మండలం కెజె.పురం, అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేట గ్రామ సచివాలయాల్లో వినతిప్రతాలు అందజేశారు. శ్రీకాకుళం జిల్లాలో లావేరు, టెక్కలి, కొత్తూరుతో పాటు పలు మండలాల్లో గ్రామ సచివాలయాల వద్ద ఉపాధి కార్మికులు ధర్నా చేశారు.

## 'విద్యుత్ బస్సులను ఆర్టీసీయే నిర్వహించాలి'




**అరసవల్లి, పతాకం న్యూస్:** విద్యుత్ బస్సులను ఆర్టీసీ సంస్థ సిబ్బందితోనే నిర్వహించాలని ఏపీపీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో గేట్ మీటింగ్, ధర్నా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. స్త్రీ శక్తి బస్సుల్లో జీరో టిక్కెట్ విధానాన్ని నిలుపుదల చేసి, మిగిలిన ప్రయాణికుల మాది రిగా టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకుని సిబ్బం దిపై పనిభారం తగ్గించాలని కోరారు. సమస్య లను పరిష్కరించాల ని, ప్రయాణికులకు సరిప డా కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, అన్ని కేటగిరీల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్‌ను ప్రకటించా లని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎన్‌వీఆర్ మూర్తి, ఎంఎస్ఎన్ రాజు, ఎంఎస్‌పీ రావు, ఎంఎల్ రావు, ఎంఆర్ మూర్తి, శాంతమ్మ, ఎన్ఎస్ లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

## ప్రియురాలి ఎదుటే ప్రియుడి హత్య



**అన్నానగర్, పతాకం న్యూస్:** కోవిల్‌పట్టి బస్టాండ్ వద్ద ఒక యువకుడిని అతని ప్రియురాలి కళ్లెదుటే కత్తితో పొడిచి చంపారు. ఈ దారు ణానికి పాల్పడిన ప్రియురాలి తండ్రి సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. తూత్తుకుడి జిల్లాలోని కోవిల్‌పట్టి సమీపంలో ఉన్న కరడికుళం ప్రాంతానికి చెందిన మాణిక్కం కుమారుడు సంజయ్ (18). ఇతను చెన్నైలో శిల్పిగా పనిచేస్తున్నాడు. ఇతను కేచ్చిలపురానికి చెందిన కుమార్ కుమార్తెను ప్రేమించాడు. ఈ ప్రేమ వ్యవహారాన్ని కుమార్ ఒప్పుకోలేదు. కొన్ని రోజుల క్రితం, సంజయ్ విహారయాత్ర కోసం పట్టణానికి వచ్చాడు. సంజయ్ తన స్నేహితులతో కలిసి చెన్నైకి తిరిగి వెళ్లడానికి నాలుగు వరుసల రహదారిపై ఉన్న కోవిల్‌పట్టి అదనపు బస్టాండ్‌కు చేరుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న కుమార్, సంజయ్‌తో మాట్లాడటానికి తన కుమార్తె, బంధువులైన శంకరనారాయణన్ (51), మారిముత్తు (38)తో కలిసి అక్కడికి వచ్చాడు. కుమార్, శంకరనారాయణన్, మారిముత్తు సంజయ్‌తో మాట్లాడుతుండగా, వారి మధ్య అకస్మాత్తుగా వాగ్వాదం చెలరేగింది. ఆగ్రహానికి గురైన వారు, తాము దాచి ఉంచిన కత్తితో సంజయ్‌ను పొడిచారు. ఇది చూసి అతని స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. అతని ప్రియురాలు దిగ్భ్రాంతికి గురైంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంజయ్ ను రక్షించి, చికిత్స కోసం నెల్లై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ తీవ్ర చికిత్స అందించినప్పటికీ, సంజయ్ మరణించాడు.హత్యకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి కుమార్, శంకరనారాయణన్, మారిముత్తు అనే ముగ్గురిని అరెస్టు చేసి విచారిస్తున్నారు.

# 'ప్రధానమంత్రి బీమా యోజన' రూ.5లక్షలకు పెంపు?




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సామాన్యులకు సైతం బీమా లబ్ధి చేకూర్చేలా కేంద్రం 2015 సంవత్సరంలో గ్రామీద్ (జీవిత బీమా), గ్రావీజీజీద్ (ప్రమాద బీమా) పథకాలు ప్రవేశపెట్టింది. జీవిత బీమా మొత్తం రూ.2లక్షలు కాగా, ప్రీమియం సంవత్సరానికి రూ.436. అదే విధంగా ప్రమాద బీమా మొత్తం రూ.2లక్షలు కాగా, ప్రీమియం రూ.20మాత్రమే. ప్రీమియం బ్యాంకు ఖాతాల నుంచి ఆటో డెబిట్?కు అనుసంధానం చేయడం తెలిసిందే. ఈ పథకాలు ప్రారంభించి 11ఏళ్లు పూర్తి కాగా, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని బీమా మొత్తాన్ని రూ.2లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రీమియం పెంపు, తదితర అంశాలపై బీమా కంపెనీలతో ప్రభుత్వం చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ పథకాల్లో చేరిన వారికి త్వరలో రెన్యువల్ కానున్నట్లు మెసేజ్?లు అందుతున్నాయి. ఈ రెండు పథకాల ప్రీమియం, వాటి మధ్య తేడాలు, ప్రయోజనాలు ఏమిటో తెలుసా?

"బీమా పథకాలు కుటుంబ సభ్యులకు ఎంతో ధీమా కల్పిస్తాయి. ఊహించని, విపత్కర పరిస్థితుల్లో బీమా అండగా నిలుస్తుంది. చాలా మంది బీమా కిస్తీలు చెల్లించలేక వాటి ప్రయోజనాలు అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో అందరికీ అందుబాటులో ఉండేలా కేంద్రం రెండు బీమా పథకాలను ప్రవేశపెట్టింది. అవి ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (గ్రావీజీజీద్) జీవిత బీమా, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (గ్రామీద్) ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తుంది.

### ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన

18 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న వారు ఈ స్కీమ్‌లో చేరేందుకు అర్హులు. బ్యాంకు/ పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉండాలి. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉన్నా, ఒక పొదుపు ఖాతా ఉన్న బ్యాంకు నుంచి మాత్రమే నమోదు చేసుకోవాలి. పాలసీదారుకు 55 సంవత్సరాల వరకు జీవిత బీమా పొందేందుకు అవకాశం ఉంటుంది. పథకం కాలపరిమితి సంవత్సరం కాగా, జూన్ 1 నుంచి మే 31 వరకు అమల్లో ఉంటుంది. ఒకసారి ఇందులో చేరిన వారికి మే 25-31 మధ్య ప్రీమియం మొత్తం ఆటో డెబిట్ ద్వారా రెన్యువల్ అవుతుంది. కొత్తగా ఈ పథకంలో చేరే వారికి జూన్ 1 నుంచి మే 31 వరకు (ఏడాది పాటు) కవరేజీ ఉంటుంది. పాలసీదారుడు మరణిస్తే రూ.2 లక్షల హామీ మొత్తాన్ని నామినీకి అందజేస్తారు తప్ప మెచ్యూరిటీ ప్రయోజనాలు ఉండవు.

ప్రీమియం (కిస్తీ) డెబిట్ సమయానికి మీ ఖాతాలో బ్యాలెన్స్ లేకపోతే పాలసీ రద్దవుతుంది. ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన పథకాన్ని ప్రారంభించినప్పుడు కేవలం రూ.330 చెల్లిస్తే సరిపోయేది. కానీ, ప్రస్తుతం ప్రీమియం రూ.436కు పెంచారు. బ్యాంకు ఖాతా నుంచి ఆటోడెబిట్ ద్వారా బ్యాంకు/పోస్టాఫీసు ఖాతా నుంచి ఒకే వాయిదాలో ప్రీమియం మొత్తాన్ని చెల్లిస్తే సరిపోతుంది.

పథకంలో చేరే నెల ఆధారంగా ప్రీమియం మారుతుంది. జూన్- ఆగస్టు మధ్యలో చేరితే రూ.436, సెప్టెంబరు-నవంబరు మధ్య చేరితే రూ.342, డిసెంబరు-ఫిబ్రవరి మధ్య చేరితే రూ.228, అదే మార్చి-మే మధ్య అయితే రూ. 114 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. పథకంలో చేరే వారు ప్రీమియం మొత్తాన్ని ఏటా ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా తీసుకునేలా బ్యాంకులను అనుమతించాలి.

### ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన

ప్రధాన మంత్రి సురక్షా బీమా యోజన (గ్రామీద్) ప్రీమియం సంవత్సరానికి రూ.20. 18 - 70 సంవత్సరాల మధ్య వయసున్న వారు ఈ పథకంలో చేరొచ్చు. ఏదైనా బ్యాంకు/ పోస్టాఫీసులో పొదుపు ఖాతా ఉండాలి. జూన్ 1 నుంచి మే 31 వరకు (సంవత్సరం పాటు) ఈ బీమా వర్తిస్తుంది. ఈ మేరకు మే నెలాఖరులో పొదుపు ఖాతా నుంచి రూ.20 కట్ అవుతాయి. చందాదారుడు మరణించినా లేదా శాశ్వతంగా వైకల్యానికి గురైనా రూ.2 లక్షలు, పాక్షికంగా వైకల్యానికి గురైతే రూ.లక్ష పరిహారం అందిస్తారు. చందాదారుడి వయసు 70 ఏళ్లు దాటినప్పుడు ఈ పథకం ఆటోమేటిక్‌గా రద్దవుతుంది తప్ప మెచ్యూరిటీ ప్రయోజనాలు ఏమీ ఉండవు.

అతి తక్కువ ప్రీమియంతో లభించే PMSBY, PMJJ-BY పథకాలు రెండింట్లోనూ చేరొచ్చు. రెండింటికీ కలిపి ఏడాది ప్రీమియం రూ.456 అవుతుంది. ఇంటర్నెట్/ మొబైల్ బ్యాంకింగ్ సదుపాయం కలిగిన వారు యాప్ లేదా సంబంధిత బ్యాంకు వెబ్‌సైట్‌లో ఇన్సూరెన్స్ లేదా సోషల్ సెక్యూరిటీ స్కీమ్స్ విభాగంలోకి వెళ్లాలి. PMSBY, PMJJBY పథకాలు ఎంచుకున్నాక మీ వ్యక్తిగత, నామినీ వివరాలు సమర్పించాలి. ఏటా ప్రీమియం పొదుపు ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా కట్ చేసుకునేలా ఆటోడెబిట్ ఆప్షన్ టిక్ చేయాలి.

# డబల్ ఇంజిన్ సర్కారులో డబల్ బాదుడు



**అమరావతి, పతాకం న్యూస్:** డబల్ ఇంజన్ సర్కార్‌లో ప్రజలపై పెట్రోలు, డీజిల్ ఛార్జీల రూపంలో డబల్ భారాలు వేస్తున్నారని, ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచి పేదల నడ్డి విరిచారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ ఎంబివికెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు డి.రమాదేవితో కలిసి ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా స్థిరంగా ఉన్న గ్యాస్, పెట్రోలు ఛార్జీలను ఎన్నికల ముగిసిన వెంటనే పెంచి కేంద్రం ప్రజలపై పెనుభారం వేసిందని విమర్శించారు. కమర్షియల్ గ్యాస్‌పై ఏకంగా రూ.990పెంచిన విషయాన్ని గుర్తుచేశారు. పెరిగిన పెట్రో ధరలపై ఆటో కార్మికులు, ప్రయివేటు రవాణా ట్రాన్‌పోర్టు, లారీ యజమానులు ఆందోళనకు దిగుతున్నారని, కొన్నిచోట్ల ఇప్పటికే వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేస్తున్నారని, వారందరికీ సిపిఎం తరుపున మద్దతు చెబుతున్నట్లు ప్రకటించారు. తక్కువ ధరకు వస్తున్న ఇరాన్, రష్యా చమురు కొనుగోలు చేయకుండా అధిక ధరకు అమెరికా వద్ద కొనడం వల్లే ధరలు పెరుగుతున్నాయని, దీనికి కేంద్రం లొంగుబాటు విధానాలే కారణమని తెలిపారు. రష్యా బ్యారెల్ చమురు 56 డాలర్లకు ఇస్తుంటే అమెరికా 120 డాలర్లకు అమ్ముతోందని, అయినా బిజెపి ప్రభుత్వం వారివద్దే కొంటోందని పేర్కొన్నారు. దీంతోపెట్రోలు లీటరు రూ.113కు చేరిందని అన్నారు. ఇదే పాండిచ్చేరిలో రూ.100 ఉందని, తెలంగాణాలో రూ.111అని తెలిపారు. మనరాష్ట్రంలో వాస్తవంగా మొత్తం ధరలో అత్యధికంగా రూ.29లు పన్ను ఉందని, సగం అదనపు ట్యాక్సులేనని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదనపు ట్యాక్సు తగ్గించుకుని ప్రజలపై భారం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఇలా ధరలు పెంచుకుంటూపోతే వామపక్షాలు దేశవ్యాపితంగా పెద్దఎత్తున పోరాటం నిర్వహిస్తాయని హెచ్చరించారు.

మత్స్యకారుల విషయంలో చంద్రబాబు మోసపూరిత ప్రకటనలు చేస్తున్నారని, వారి జోలికి వస్తే ఊరుకోనని అంటున్నారని, వాస్తవంగా తమిళనాడు బోట్లను ఎపి సముద్రజలాల్లో వేటకు వస్తే టిడిపి నాయకులే సహకరించారని తెలిపారు. ఇటీవల జువ్వలదిన్నె ఘటనలో తమిళనాడు బోట్లను పట్టుకుంటే టిడిపి నాయకులే విడిపించారని, ఒకపక్క రక్షణ కల్పిస్తామని చెబుతూనే మరోవైపు దోపిడీకి సహకరిస్తున్నారని, ముందువారిని కట్టడి చేయాలని కోరారు. ఒకవైపు కోస్తాతీరంలో మత్స్యకారుల భూములు లాక్కొని వృత్తిని దెబ్బతీస్తూ, మరోవైపు వారికి అండగా ఉంటామని చెప్పడం మోసపూరితమన్నారు. కోస్తాతీరాన్ని టూరిజం, అభివృద్ధి పేరుతో కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని తెలిపారు. పొగాకు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను మోసం చేస్తున్నాయని తెలిపారు. పొగాకు బోర్డు వద్ద రైతుల నుండి వసూలు చేసిన రూ.1100 కోట్లు ఉన్నా వాటిని కేంద్రం ఖజానాలో కలిపేసుకుందని, దాన్ని వినియోగించి రాష్ట్ర ప్రభుత్వం సొసైటికి రూ.300 కోట్లు, కేంద్రం ఎస్‌సిటికి రూ.500 కోట్లు ఇచ్చి, రైతుల డబ్బులతో నే పొగాకు కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని కోరారు. పొగాకు ధరను సగానికి సగం తగ్గించడం అంటే రైతులను శిక్షించడమేనని, ఇది ఎంత మాత్రమూ సమంజసం కాదని అన్నారు. ప్లాట్‌ఫారమ్స్‌కు తెస్తున్న పొగాకులో సగం బేళు తిరస్కరణకు గురవడం ఆందోళనకరమన్నారు. పొదుపు అంటూనే బంగారం దిగుమతి ఒకవైపు పొదుపు చేయాలని, బంగారం కొనొద్దని చెబుతున్న ప్రధాని మరోవైపు భారీగా దిగుమతికి అనుమతిస్తున్నారని వి. శ్రీనివాసరావు విమర్శించారు. అదే సమయంలో పేదలు కొనలేని విధంగా ధరలు పెంచుతున్నా కేంద్రం చూస్తూ ఊరుకుందని, ఇప్పుడు తాళిబొట్టులో పెట్టే బంగారం కూడా కొనలేని స్థితికి ధరలుపెరిగాయని తెలిపారు. ఇదేనా హిందూ స్త్రీలను ఆదుకునే విధానం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం బంగారం ధరలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. కార్పొరేట్లకు చౌక లేబర్ సరఫరా చేసే పాలసీ .. కార్పొరేట్ కంపెనీలకు చౌకగా కార్మికులను తయారుచేసే విధంగా జనాభా పాలసీ ఉందని శ్రీనివాసరావు విమర్శించారు.

## ప్రారంభమైన సరస్వతి నది అంత్య పుష్కరాలు..

**భూపాలపల్లి, పతాకం న్యూస్:** మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమం వద్ద సరస్వతి నది అంత్య పుష్కరాలు ప్రారంభమయ్యాయి. గురువారం తెల్లవారుజామున 5:43 గంటలకు కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి తొలి పుష్కర స్నానం ఆచరించి.. ఈ పుష్కరాలను ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, పలువురు ప్రజాప్రతినిధులతోపాటు ఉన్నతాధికారులు నదిలో పుణ్య స్నానం ఆచరించారు. ఈ పుష్కరాల్లో పాల్గొనేందుకు భారీగా భక్తులు తరలి వస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తెలంగాణ దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. మే 21 నుంచి జూన్ 1వ తేదీ వరకు మొత్తం 12 రోజుల పాటు ఈ అంత్య పుష్కరాలు జరగనున్నాయి. ఈ పుష్కరాల నిర్వహణకు ప్రభుత్వం రూ. 200 కోట్ల కేటాయించిన సంగతి తెలిసిందే.

ఈ అంత్య పుష్కరాలకు దాదాపు 40 లక్షల మంది భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.



## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



**కర్నూలు, పతాకం న్యూస్:** జాతీయ ఉపాధి హామీ పథకం కూలీల సమస్యలు పరిష్కరించి, ఫొటో యాప్‌ను రద్దు చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఖాజిపేట గ్రామ పొలిమేరలో జరుగుతున్న ఉపాధి పనుల దగ్గరకు వెళ్లి శ్రామికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వికసిత్ భారత్ జీ రాంజీ పథకం రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని అన్నారు. ఉపాధి పనుల్లో ఉపాధి కూలీలకు పనిముట్లు అందించాలని, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం అందించాలన్నారు. పని చోట ప్రమాదంలో మరణించిన శ్రామికులకు రూ.30 లక్షలు, గాయపడితే రూ.5 లక్షలు ఇవ్వాలన్నారు. గోవిందమ్మ, స్వాములు, వడ్డె వెంకటేశ్వర్లు, చిన్నమ్మ, రాణెమ్మ, లక్ష్మీదేవి, సీతరాముడు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

## ముగిసిన నిత్యానందరెడ్డి పోలీస్ కస్టడీ.. కడప సెంట్రల్ జైలుకు తరలింపు



**కడప, పతాకం న్యూస్:** వైసీపీ నేత, కడప మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి రెండు రోజుల పోలీస్ కస్టడీ ముగిసింది. రియల్ ఎస్టేట్ వ్యాపారి పెద్ద దస్తగిరి హత్య కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఆయనను కోర్టు అనుమతితో చిన్నచౌక్ పోలీసులు రెండు రోజుల పాటు తమ కస్టడీలోకి తీసుకుని సుదీర్ఘంగా విచారించారు. ప్రస్తుతం కడప సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న నిత్యానందరెడ్డిని, ఈ కేసులో పట్టుబడిన ఇతర నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా పోలీసులు ప్రశ్నించారు. ముఖ్యంగా పెద్ద దస్తగిరి హత్య జరిగిన తర్వాత నిందితులు సురక్షితంగా పారిపోయేందుకు వెనుక ఉండి సహకరించారనే కోణంలో పోలీసులు కీలక వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. పోలీసుల ప్రాథమిక విచారణలో మృతుడు పెద్ద దస్తగిరికి, నిత్యానందరెడ్డికి మధ్య గత కొంతకాలంగా నడుస్తున్న వివాదాస్పద భూ లావాదేవీల వివాదం గురించిన సమాచారం బయటకు వచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా, ఈ దారుణ హత్య వెనుక కేవలం పట్టుబడిన వారే కాకుండా, ఇంకొందరి పాత్ర కూడా ఉన్నట్టు పోలీసు విచారణలో తేలినట్టు సమాచారం.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం




**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. ఒప్పంగి గ్రామంలో మహిళలకు పలు చట్టాలపై అవ గాహన కలిగించారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలను వివ రించారు. చిన్నతనంలో వివాహం చేయడం వల్ల అనారోగ్యానికి గురి కావడమే కాకుండా పుట్ట బోయే బిడ్డ మానసిక పరిపక్వత లోపించే ప్రమాదం ఉందన్నారు. మహిళలకు న్యాయపరమైన సహాయాన్ని ఉచితంగా సంస్థ అందిస్తుం దన్నారు. నేరుగా గాని టోల్ ఫ్రీ నంబరు 15100లో గాని సంప్రదించ వచ్చన్నారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ ఆదిల్‌షా, న్యాయవాది ఇందిరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎయిరిండియా విమానంలో 179 మంది.. త్రుటిలో తప్పిన ప్రమాదం!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఢిల్లీ నుంచి బెంగళూరు వచ్చిన ఎయిరిండియా విమానానికి ల్యాండింగ్ సమయంలో త్రుటిలో ప్రమాదం తప్పింది. రన్‌వేపై దిగుతున్న తరుణంలో దాని వెనుక భాగం (తోక) భూమిని బలంగా తాకింది. అయితే పైలట్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో అంతా సురక్షితంగా బయటపడ్డారు. ఢిల్లీ నుంచి బెంగళూరుకు 179 మంది ప్రయాణికులతో వచ్చిన ఏఐ2651 ఎయిర్ బస్ విమానం ల్యాండింగ్ కావడానికి సిద్ధమైంది. సరిగ్గా అదే సమయంలో రన్‌వేపై నుంచి మరో పెద్ద విమానం టేకాఫ్ కావడంతో గాల్లో తీవ్రమైన గాలి అలల ఉద్ధృతి (విండ్ టర్బులెన్స్) ఏర్పడింది. దీనివల్ల విమానం బ్యాలెన్స్ తప్పడంతో పైలట్లు ల్యాండింగ్‌ను తాత్కాలికంగా ఆపి మళ్లీ విమానాన్ని పైకి లేపేందుకు ప్రయత్నించారు. ఈ ప్రక్రియలోనే విమానం తోక భాగం రన్‌వేను గీసుకుంటూ వెళ్లింది. ఈ ఘటన జరిగిన వెంటనే అధికారులు అలర్ట్ అయ్యారు. ఎయిరిండియా సంస్థ ఈ ఎయిర్‌బస్ ఏ321 విమానాన్ని తదుపరి తనిఖీల కోసం ఎయిర్‌పోర్టులోనే నిలిపివేసింది. దీనివల్ల బెంగళూరు నుంచి తిరిగి ఢిల్లీ వెళ్లాల్సిన ఏఐ2652 ఫ్లైట్‌ను క్యాన్సిల్ చేశారు.

## యువకుడి అనుమానాస్పద మృతి



**తెనాలి, పతాకం న్యూస్:** వాలీబాల్ కోర్టులో నెట్‌కు వేలాడుతూ యువకుడి మృతదేహం ఉన్న ఘటన గుంటూరు జిల్లా తెనాలి మండలం కంచర్లపాలెంలో కలకలం రేపింది. దీనిపై పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కంచర్లపాలెం గ్రామానికి చెందిన కోపల్లె కార్తిక్ (18) ఇటీవలే తెనాలిలోని ఓ ఐటిఐ కాలేజీలో చదువు పూర్తి చేసి ఇంటివద్దే ఖాళీగా ఉంటున్నారు. గ్రామంలో ఓ పెద్ద ఖాళీ స్థలంలో వాలీబాల్ కోర్టు ఉంది. విద్యుత్ లేనప్పుడు, ఇతర ఖాళీ సమయాల్లో ఎక్కువ మంది యువకులు, పెద్దవారు అక్కడికెళ్లి విశ్రాంతి తీసుకుంటుంటారు. కరెంటు పోవడంతో కార్తిక్ ఇంటి నుండి బయటకు వెళ్లారు. అయితే తిరిగి రాలేదు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న స్థానికులు వాలీబాల్ కోర్టులో నెట్‌కు కార్తిక్ మృతదేహం వేలాడుతూ ఉండడాన్ని గమనించి స్థానిక విఆర్‌ఒకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. తెనాలి డిఎస్‌పి బి జనార్ధనరావు, రూరల్ సిఐ షేక్ నాయబ్ రసూల్ ఘటనా స్థలిని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి వివరాలు సేకరించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతునికి తల్లిదండ్రులు, అక్క, తమ్ముడు ఉన్నారు.

## చార్మినార్ సమీపంలో భారీ అగ్నిప్రమాదం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** చార్మినార్ సమీపంలోని మదీనా చౌరస్తా ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ ప్రముఖ వస్త్ర దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ప్రాంతమంతా భయాందోళనకు గురైంది. ప్రమాద తీవ్రతకు భారీ అగ్నికీలలు, దట్టమైన పొగ ఆకాశాన్ని కమ్మేశాయి. దుకాణంలో పెద్ద మొత్తంలో వస్త్ర నిల్వలు ఉండటంతో మంటలు వేగంగా వ్యాపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది పలువురు ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకురావడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రమాదం కారణంగా సమీప ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని పరిసర ప్రాంతాలను ఖాళీ చేయిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రీడయాబెటిస్ ఉన్నవారికి విటమిన్ డి ఇస్తే మెరుగైన ఫలితాలు..



ప్రస్తుత కాలంలో భారతదేశంలో ప్రీడయా బెటిస్ సమస్య వేగంగా పెరుగుతోంది. ఐసీఎంఆర్-ఇండియాబ్ అధ్యయనం ప్రకారం దేశ జనాభాలో సుమారు 15.3 శాతం మంది ప్రీడయా బెటిస్‌తో బాధపడుతున్నారు. ఇది దాదాపు 13.6 కోట్ల మందికి సమానం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఈ పరిస్థితి టైప్-2 డయాబెటిస్‌గా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధిక మోతాదులో విటమిన్-డి సప్లిమెంట్లు కొంతమందిలో డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది. ఈ పరిశోధనను అమెరికాలోని టఫ్ట్స్ యూనివర్సిటీ పరిశోధకులు నిర్వహించారు. అధ్యయన ఫలితాలు జామా నెట్‌వర్క్ ఓపెన్ జర్నల్‌లో ప్రచురిత మయ్యాయి.

పరిశోధకులు ముందుగా నిర్వహించిన డి2డి ట్రయల్ డేటాను మళ్లీ విశ్లేషించారు. ఇందులో పాల్గొన్న పెద్దలకి రోజుకు 4,000 ఐయూ విటమిన్-డి లేదా ప్లాసీబోను సుమారు రెండున్నరేళ్ల పాటు ఇచ్చారు. మొదటి దశలో జరిగిన డి2డి అధ్యయనంలో పాల్గొన్నవారిలో డయాబెటిస్ ప్రమాదం తగ్గినట్టు స్పష్టమైన ఫలితాలు కనిపించలేదు. అయితే తాజా విశ్లేషణలో కొన్ని ప్రత్యేక జన్యు లక్షణాలు ఉన్నవారికి విటమిన్-డి వల్ల ప్రయోజనం కలిగినట్టు గుర్తించారు. ఈ పరిశోధనలో భాగంగా 2,098 మంది పాల్గొన్నవారి డీఎన్ఏ నమూనాలను పరీక్షిం చారు. ముఖ్యంగా విటమిన్-డి రిసెప్టర్ (వీడీఆర్) జీన్లలో ఉండే మూడు సాధారణ వేరియంట్లను పరిశీలించారు. రక్త పరీక్షల ద్వారా ఫాస్టింగ్ గ్లూకోజ్ 126 ఎంజీ/డీఎల్ కంటే ఎక్కువగా ఉండటం, రెండు గంటల తర్వాత గ్లూకోజ్ 200 ఎంజీ/డీఎల్ దాటడం లేదా హెచ్‌బీఏ1సీ 6.5 శాతానికి మించితే డయాబెటిస్‌గా నిర్ధారించారు. అధ్యయనం ప్రకారం వీడీఆర్ జీన్‌లో ఏపాల్ ప్రాంతంలో ఏసీ లేదా సీసీ రకాల వేరియంట్లు ఉన్నవారిలో విటమిన్-డి సప్లిమెంట్లు తీసుకున్నప్పుడు డయాబెటిస్ ప్రమాదం సుమారు 19 శాతం వరకు తగ్గినట్టు గుర్తించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 70 శాతం మందిలో ఈ వేరియంట్లు ఉండే అవకాశముందని పరిశోధకులు చెబుతున్నారు.

1అయితే ఏఏ వేరియంట్ ఉన్నవారిలో మాత్రం ఈ ప్రయోజనం కనిపించలేదని వెల్లడించారు. విటమిన్-డి శరీరంలో ఇన్సులిన్ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్యాంక్రియాస్‌లో ఇన్సులిన్ ఉత్పత్తి చేసే కణాల్లో విటమిన్-డి రిసెప్టర్ ప్రోటీన్లు ఉంటాయి. ఇవి యాక్టివ్ విటమిన్-డితో కలిసి పనిచేస్తాయి. అయితే జీన్‌లలో ఉండే మార్పుల వల్ల ఈ ప్రక్రియ ప్రభావితం అవుతుందని పరిశోధకులు వివరిస్తున్నారు. అధ్యయనంలో ఉపయోగించిన 4,000 ఐయూ విటమిన్-డి మోతాదు సాధారణంగా సూచించే రోజువారీ 600 నుంచి 800 ఐయూ కంటే చాలా ఎక్కువ. అయినప్పటికీ ట్రయల్ సమయంలో తీవ్రమైన దుష్ప్రభావాలు కనిపించలేదని పరిశోధకులు పేర్కొన్నారు.

అయితే వైద్యుల సలహా లేకుండా అధిక మోతాదులో విటమిన్-డి ని తీసుకోవద్దని హెచ్చరిస్తున్నారు. అధికంగా తీసుకుంటే విటమిన్-డి టాక్సిసిటీ ప్రమాదం ఉంటుందని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ప్రీడయాబెటిస్ ఉన్నవారిలో ఎవరికి విటమిన్-డి సప్లిమెంట్లు ఎక్కువ ప్రయోజనం ఇస్తాయో జన్యు పరీక్షల ద్వారా ముందుగానే గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు చెబుతున్నారు. ఇది వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా చికిత్సలు అందించే పర్సనలైజ్డ్ మెడిసిన్ దిశగా ఒక ముందడుగుగా భావిస్తున్నారు. అయితే నిపుణులు జీవనశైలినే అత్యంత కీలక అంశంగా పేర్కొంటున్నారు. సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం, యోగా, బరువు నియంత్రణ వంటి అలవాట్లు డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయని చెబుతున్నారు. విటమిన్-డి సప్లిమెంట్లు కొన్ని జన్యు లక్షణాలు ఉన్నవారికి అదనపు రక్షణగా ఉపయోగపడే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

# ఎరువుల బ్లాక్ మార్కెట్, అక్రమ విక్రయాలకు చెక్!

## ప్రభుత్వం యాప్ ద్వారా అమ్మకాలు.. 50 శాతం సబ్సిడీపై రైతులకు అందజేత



ఒంగోలు, పతాకం న్యూస్: ఎరువులు పక్కదారి పట్టకుండా ఉండేందుకు, విక్రయాల్లో అక్రమాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం యాప్ ద్వారా అమ్మకాలు చేపట్టాలని నిర్ణయించింది. జిల్లాలో ఖరీఫ్ కన్నా ఎరువుల వాడకం రబీ సీజన్‌లో కాస్తంత ఎక్కువగా ఉంటుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 57,468 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువులు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో సుమారు సగం మేర కాంప్లెక్స్ ఎరువులు ఉంటాయి. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన 57,468 మెట్రిక్ టన్నుల ఎరువుల్లో 41,195 మెట్రిక్ టన్నులు సిద్ధం చేశారు. అందులో ఇప్పటివరకు 4,561 మెట్రిక్ టన్నుల విక్రయాలు జరిగాయి. మిగిలిన 36,954 మెట్రిక్ టన్నుల ఎరువులు వివిధ ప్రాంతాల్లో వ్యాపారులు, ప్రభుత్వ సంస్థలు, గ్రామస్థాయిలో ఉండే వ్యవసాయశాఖకు సంబంధించిన రైతు సేవా కేంద్రాల్లో నిల్వ ఉంచారు. గతంలో వివిధ రూపాలలో సేకరించిన సమాచారం ఆధారంగా ఆ డేటాను క్రోడీకరించి ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేశారు. ఆ యాప్‌ను ఎరువుల విక్రయదారులు ఇన్‌స్టాల్ చేసుకొని ఉన్నారు. ఎరువుల కోసం వచ్చిన రైతుల పేరును అందులో నమోదు చేస్తే ఆయనకు సంబంధించిన భూమి, పంటల సాగు వివరాలు వస్తాయి. తదనుగుణంగా వారికి ఎరువులు విక్రయించేలా ఏర్పాటు చేశారు. ప్రయోగాత్మకంగా దీన్ని అమలు చేస్తున్నారు. ఇవి విజయవంతం అయితే భవిష్యత్‌లో పూర్తిగా ఈ విధానాన్ని ఎరువుల విక్రయాలలో అమలు చేయనున్నారు. అప్పటి వరకు గతంలో వలే కూడా ఎరువులు ఇవ్వనున్నట్లు అధికారవర్గాల సమాచారం.

తరచూ కొరత వచ్చే యూరియా విషయం లోనూ ఈసారి ముందుజాగ్రత్తలు తీసుకున్నారు. ఈ సీజన్ అవసరాలలో భాగంగా ఇప్పటికే 10,410 మెట్రిక్ టన్నుల యూరియాను తెప్పించి నిల్వ చేశారు. దీంతోపాటు 3,091 మెట్రిక్ టన్నుల డీఏపీ, సుమారు 19,821 టన్నుల కాంప్లెక్స్ ఎరువులను సిద్ధంగా ఉంచారు. ఎరువుల అక్రమ కొనుగోళ్లు, పక్కదారి పట్టడాన్ని నివారించడం కోసం ఈ సీజన్ నుంచి విక్రయాలను యాప్‌లో నమోదుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే రైతుల పేర్లు, భూమి వివరాలు, గత ఏడాది సాగు చేసిన పంట వివరాలు ప్రభుత్వం వద్ద ఉన్నాయి.

ఖరీఫ్ సీజన్ ఆరంభమవుతున్న నేపథ్యంలో 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీకి వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. భూమిలో సారం, సేంద్రియ శాతం పెంపు ద్వారా రసాయన ఎరువుల వాడకం తగ్గింపు లక్ష్యంగా పచ్చిరొట్ట పైర్ల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందుకోసం 50శాతం సబ్సిడీపై జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట ఎరువులను రైతులకు ఇవ్వనున్నారు. ఈ సీజన్‌కు 4,253 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు జిల్లాకు కేటాయించారు. అందులో 2,486 క్వింటాళ్లు జనుము ఉండగా 947 క్వింటాళ్లు జీలుగ, 820 క్వింటాళ్లు పిల్లిపెసర సిద్ధం చేశారు. రైతులు స్థానిక వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి సబ్సిడీ విత్తనాలు పొందాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.శ్రీనివాసరావు సూచించారు. ఆ పంటల సాగు ద్వారా భూ ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు.

## భారత్‌లో బిలియనీర్ల జాబితాలో మొదటి రెండు స్థానాల్లో అంబానీ, అదానీ

**ముంబై, పతాకం న్యూస్:** అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ క్షీణించినప్పటికీ భారతీయ బిలియనీర్లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా–2026 ప్రకారం.. భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తి విలువ తొలిసారి లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటడం విశేషం. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్తవారు ఈ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు. భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు. భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది. ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ 'ఫిజిక్స్ వాలా' కో–ఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన తమ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్ కావడంతో ఈ ఇద్దరు కుబేరుల క్లబ్‌లోకి అడుగుపెట్టారు. ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా అరవింద్ శ్రీనివాస్ (31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న 'పెర్‌ప్లెక్సిటీ' ఏఐ సెర్చ్ స్టార్టప్ కో–ఫౌండర్ అయిన ఈయన శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత 'పేటీఎమ్' వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి పునరాగమనం చేశారు. మరోవైపు 'ఓలా క్యాబ్స్' ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తో పాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.




## ఐపీఎల్ 2026లో అరుదైన రికార్డు.. కోహ్లీ సరసన చేరిన రోహిత్ శర్మ



ఐపీఎల్ 2026లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా ముంబై ఇండియన్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్‌లో ముంబై స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ అదిరిపోయే రికార్డు నెలకొల్పాడు. లీగ్‌లో కనీసం ఒక సిక్సర్‌తో అత్యధికంగా 144 మ్యాచులాడిన బ్యాటర్‌గా రోహిత్ నిలిచాడు. ఈ క్రమంలో ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ సరసన చేరాడు. కేకేఆర్‌తో మ్యాచ్ సందర్భంగా రోహిత్ శర్మ 2 సిక్స్‌లు బాది ఈ ఫీట్ సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో రో–కో ఇప్పటి వరకు 28 మ్యాచ్‌ల చొప్పున ఆడటం విశేషం. మ్యాచ్ విషయానికొస్తే.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్.. ఈ వార్త రాసే సమయానికి 14 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. కోల్‌కతాలో వర్షం కారణంగా కాసేపు మ్యాచ్ ఆగిపోయింది. వాన తగ్గడంతో తిరిగి ప్రారంభమైంది. ర్యాన్ రికెల్టన్(6), రోహిత్ శర్మ(15), నమన్ ధీర్(0), సూర్యకుమార్ యాదవ్(15), తిలక్ వర్మ(20) స్వల్ప పరుగులకే పెవిలియన్ చేరారు. ప్రస్తుతం క్రీజులో హార్దిక్ పాండ్య(26ని), విల్ జాక్స్(5ని) ఉన్నారు. కేకేఆర్ బౌలర్లలో గ్రీన్ 2, సౌరభ్ దూబె 2, కార్తిక్ త్యాగి 1 వికెట్ పడగొట్టారు. ఈ పోరులో కేకేఆర్ నెగ్గితేనే ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంటాయి. ఇక ముంబై ఇండియన్స్ ఇప్పటికే టోర్నీ నుంచి ఎలిమినేట్ అయిన సంగతి తెలిసిందే.

## కీలకమ్యాచ్‌లో ముంబైపై

# గెలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్



కీలక మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్).. ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలబెట్టుకొంది. మనీష్ పాండే (45), రోవ్‌మన్ పావెల్ (40)తోపాటు బౌలర్లు రాణించడంతో.. జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా 4 వికెట్ల తేడాతో ముంబై ఇండియన్స్‌పై నెగ్గింది. పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి ఎగబాకింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 147/8 స్కోరు చేసింది. కార్బిన్ బాష్ (32 నాటౌట్), హార్దిక్ పాండ్యా (26) టాప్ స్కోరర్లు. గ్రీన్, సౌరభ్ దూబే, కార్తీక్ తలో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. ఛేదనలో కోల్‌కతా 18.5 ఓవర్లలో 148/6 స్కోరు చేసి గెలిచింది. రహానె (21) ఫర్వాలేదనిపించాడు. బాష్ 3 వికెట్లు పడగొట్టాడు. గత కొద్ది మ్యాచ్‌లకు దూరమైన హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ మళ్లీ ముంబై జట్టులోకి వచ్చారు. మనీష్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

కష్టపడకుండానే..: మనీష్, పావెల్ రాణించడంతో.. స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా సునాయాసంగా ఛేదించింది. కెప్టెన్ రహానెతో రెండో వికెట్‌కు 38 పరుగులు జోడించిన పాండే.. పావెల్‌తో కలసి నాలుగో వికెట్‌కు 64 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపాడు. ఓపెనర్ అలెన్ (8)ను చాహర్ తొలి ఓవర్‌లోనే బౌల్డ్ చేశాడు. కానీ, రహానెతో కలసి మనీష్ ఇన్నింగ్స్‌ను నిర్మించే యత్నం చేశాడు. నాలుగో ఓవర్‌లో బుమ్రా బౌలింగ్‌లో రహానె రెండు ఫోర్లతో బ్యాట్‌కు పనిచెప్పాడు. అయితే, రహానె, గ్రీన్ (4)ను బాష్ తన వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో.. కోల్‌కతా 54/3తో ఇబ్బందుల్లో పడినట్టు కనిపించింది. కానీ, పావెల్ అండతో మనీష్ జట్టును ఆదుకొన్నాడు. వీరిద్దరూ స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. సిక్స్‌తో ఖాతా తెరిచిన పావెల్.. 10వ ఓవర్‌లో హార్దిక్ బౌలింగ్‌లో అవుటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకోగా.. అదే ఓవర్‌లో పాండే రెండు బౌండ్రీలు బాదాడు. 13వ ఓవర్‌లో మనీష్ మరో ఫోర్‌తో జట్టు స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు. అయితే, అర్ధ శతకానికి చేరువలో పాండేను బుమ్రా క్లీన్‌బౌల్డ్ చేశాడు. కోల్‌కతా గెలుపునకు 30 బంతుల్లో 30 పరుగులు కావాల్సి ఉండగా.. సిక్స్ బాదిన పావెల్‌ను ఘజన్‌ఫర్ క్యాచవుట్ చేశాడు. రఘువంశీకి కంకాషన్ సబ్‌గా వచ్చిన తేజస్వి దహియా (11)ను కూడా బాష్ అవుట్ చేసినా.. రింకూ సింగ్ (9 నాటౌట్) మరో 7 బంతులు మిగిలుండగానే జట్టును గెలుపుగీత దాటించాడు. పేసర్లు గ్రీన్, సౌరభ్ చెలరేగడంతో.. పవర్‌ప్లేలోనే నాలుగు టాపార్డర్ వికెట్లు చేజార్చుకొన్న ముంబై స్వల్ప స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హార్దిక్ సేన ఘోరంగా తడబడింది. రెండో ఓవర్‌లో ఓపెనర్ రికెల్టన్ (6), నమన్ ధిర్ (0)ను గ్రీన్ అవుట్ చేసి ఆరంభంలోనే దెబ్బతీశాడు. ఇక, నాలుగో ఓవర్‌లో సిక్స్ బాదిన మరో ఓపెనర్ రోహిత్ శర్మ (15)ను సౌరభ్ అదే ఓవర్‌లో క్యాచవుట్ చేశాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ (15) కూడా స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. దీంతో ఆరు ఓవర్లు ముగిసే సరికి ముంబై 46/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో తిలక్ వర్మ (20), కెప్టెన్ పాండ్యా నాలుగో వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. అయితే, 8వ ఓవర్ తర్వాత వర్షం కురవడంతో.. గంటపాటు ఆటకు అంతరాయం కలిగింది. మ్యాచ్ పునః ప్రారంభమైన తర్వాత స్పిన్నర్లు వరుణ్, నరైన్ పరుగులను నియంత్రించడంతో.. ముంబై స్కోరు నెమ్మదిగా సాగింది. వరుణ్ బౌలింగ్‌లో బతికి పోయిన తిలక్.. 12వ ఓవర్‌లో నరైన్ బౌలింగ్‌లో సిక్స్‌తో గేర్ మార్చే ప్రయత్నం చేశాడు. మరోవైపు పాండ్యా కూడా భారీ సిక్స్‌తో టచ్‌లోకి వచ్చాడు. కానీ, 14వ ఓవర్‌లో తిలక్‌ను కార్తీక్ అవుట్ చేశాడు.




# లాంఛనంగా ప్రారంభమైన చిరంజీవి 158వ చిత్రం



మెగాస్టార్ చిరంజీవి 158వ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తన అన్నయ్య చిరంజీవిపై తీసిన ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్లాప్ బోర్డ్ వెనుక ఉన్న ఒక అద్భుతమైన 30 ఏళ్ల నాటి విషయాన్ని గుర్తుచేస్తూ చిరంజీవి ఎక్స్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. “ఈ రోజు కల్యాణ్ బాబుకి, నాకు మధ్యలో క్లాప్ కనిపిస్తుంటే... 30 సంవత్సరాల క్రితం ఇదే సీన్ రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకు వస్తోంది ... ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’. ఈ రోజు డిప్యూటీ సీఎం హోదాలో టైమ్ తీసుకుని వచ్చి, నా 158వ సినిమా ముహూర్తంలో పాల్గొని, క్లాప్ ఇచ్చి యూనిట్ సభ్యులందరినీ ఆనందపరిచినందుకు థాంక్యూ” అని చిరంజీవి భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.

సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, పవన్ కల్యాణ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి పరిచయమైన క్లాసిక్ మూవీ ‘అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి’ (1996). ఆరోజు ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు అన్నయ్యగా చిరంజీవి ముందుండి తమ్ముడు పవన్ కల్యాణ్‌కు క్లాప్ కొట్టి వెండితెరకు పరిచయం చేశారు. ఇవాళ అదే సీన్ రివర్స్ అయింది. ఆరోజు అన్నయ్య క్లాప్ కొట్టి తమ్ముడిని ఆశీర్వదించారు. ఈరోజు తమ్ముడు ఏకంగా ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హోదాలో వచ్చి.. అన్నయ్య 158వ సినిమాకు క్లాప్ కొట్టారు. మూడు దశాబ్దాలు గడిచినా, మెగా బ్రదర్స్ మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే ఉందనడానికి ఈ క్లాప్ బోర్డ్ విజువల్ ఒక పెద్ద నిదర్శనం.

మరోవైపు, ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మలయాళ యువ నటి అనశ్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది.

# వరుస సినిమాలతో బిజీగా ‘మంచు మనోజ్’



మంచు వారి వారసుడు మంచు మనోజ్ కి రీఎంట్రీ బాగా కలిసొచ్చింది. మిరాయ్ సినిమా అతడి కెరీర్ ని మలుపుతిప్పింది. ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా మారాడు. ఒకపక్క హీరోగా, ఇంకోపక్క విలన్‌గా నటిస్తూ మంచి గుర్తింపు సంపాదించుకుంటున్నాడు. ప్రస్తుతం ఆయన నటిస్తోన్న చిత్రాల్లో డేవిడ్ రెడ్డి ఒకటి. హనుమరెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రంలో ప్రిన్స్ సినిమా ఫేమ్ మరియా ర్యబోషప్కా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ఫస్ట్ గ్లింప్స్ ఆకట్టుకున్నాయి.

మనోజ్ పుట్టినరోజు సందర్భంగా డేవిడ్ రెడ్డి టీజర్ ని రిలీజ్ చేసి బర్త్ డే విషెస్ తెలిపారు మేకర్స్. టీజర్ ఆద్యంతం ఆకట్టుకొంటుంది. బ్రిటిష్ వాళ్ళకు చుక్కలు చూపించే రాక్షసుడిగా మనోజ్ కనిపించాడు. గాంధీ ఉద్యమాన్ని అడ్డుకోవడానికి బ్రిటిష్ వాళ్ళు వేసిన ఎత్తుగడలను డేవిడ్ రెడ్డి అనే పవర్ ఫుల్ యోధుడు ఎలా అడ్డుకట్ట వేశాడు. అసలు బ్రిటిష్ వాళ్ళు వణికిపోయేలా డేవిడ్ రెడ్డి ఏం చేశాడు..? ఇండియాకు స్వాతంత్ర్యం రావడంలో డేవిడ్ రెడ్డి పాత్ర ఎంత.. ? అనేది సినిమా చూసి తెలుసుకోవాల్సిందే. మంచి మనోజ్ ఈ సినిమా కోసం బాగా కష్టపడినట్లు కనిపిస్తోంది. నటనలో ఉగ్ర రూపం చూపించాడు. ఇక సినిమాకు హైలైట్ అంటే రవి బస్రూర్ సంగీతం అనే చెప్పాలి. టోటల్ గా డేవిడ్ రెడ్డి సినిమాపై ప్రేక్షకులు అంచనాలను పెట్టేకొనేలా ఈ టీజర్ ఉంది అని చెప్పొచ్చు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం దసరా కానుకగా రిలీజ్ కానుంది. మరి ఈ చిత్రంతో మనోజ్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# 22న థియేటర్స్‌లో ‘పురుష’




బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై బత్తుల కోటేశ్వరరావు నిర్మిస్తోన్న చిత్రం ‘పురుష:’ . ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా తెలుగు సినిమా ఇండస్ట్రీకి పరిచయం కాబోతోన్నారు. వీరు వులవల దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ సినిమాను మే 22న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోన్నారు. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ప్రీ రిలీజ్ వేడుకను మేకర్స్ గ్రాండ్‌గా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో బత్తుల పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. ‘పురుష:’ సినిమాని ఈ స్థాయికి తీసుకు వచ్చిన మా నాన్న, నిర్మాత కోటేశ్వరరావుకు, అక్క సరస్వతికి థాంక్స్. మా దర్శకుడు వీరు నన్ను ఎంతో బాగా చూసుకున్నారు. నాకు ఈ జర్నీలో ఆయన ఎంతో సపోర్ట్ చేశారు. సాంకేతిక నిపుణులందరూ ఎంతగానో సహకరించారు. సప్తగిరి అన్న, కసిరెడ్డి అన్న నన్ను సొంత తమ్ముడిలా చూసుకున్నారు. వారే నా సిగ్గు, భయాన్ని, బిడియాన్ని పోగొట్టారు. వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, వీటీవీ గణేష్ వంటి వారితో వర్క్ చేయడం వల్ల ఎంతో నేర్చుకున్నాను. ఈ మూవీకి పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. నన్ను ఈ స్థాయిలో నిలబెట్టిన మా నాన్నకు థాంక్స్. మా నాన్న కష్టం చూస్తూ నేను పెరిగాను. నా కోసం మా అక్క ఏదైనా చేయడానికి సిద్ధంగా ఉంటుంది. నేనంటే ప్రాణం తనకి.

మే 22న థియేటర్లో కలుద్దామని అన్నారు.వీశీజఱవం దర్శకుడు వీరు వులవల మాట్లాడుతూ.. సరస్వతి బత్తుల వల్లే ‘పురుష:’ సినిమా ఇక్కడి వరకు వచ్చింది. ఈ జర్నీలోని ప్రతీ దశలో ఆమె మాకు ఎంతగానో సపోర్ట్ అందించారు. కథ విన్నాక, స్టోరీ బోర్డ్ చూశాక నిర్మాత కోటేశ్వరరావు ఓకే చెప్పారు. ఖర్చుకి ఎక్కడా వెనుకడుగు వేయలేదు. నాకు ఈ అవకాశం ఇప్పించిన సతీష్ ముత్యాలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. ఇందులో నటించిన నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ.. సినిమా కోసం ఎంతగానో కృషి చేశారు. సినిమా చాలా బాగా వచ్చింది. మే 22న అందరూ మా సినిమాను థియేటర్లలో చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నానని తెలిపారు.






Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**